విశాలాంధ్ర

గుంటూరు జిల్లా

ప్రజల మన్ననలు పొందేలా వాలంటీర్లు కృషి చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని అర్హత ఉన్న ప్రజలకు అందించి ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందేలా వాలంటీర్లు మరింత మెరుగ్గా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాలులో వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, జిల్లా ప్రజాపరిషత్ చైర్ పర్సన్ హెనీ క్రిస్టీనా, శాసనమండలి సభ్యులు మురుగుడు హనుమంతరావు, శాసనసభ్యులు మద్దాళి గిరిధర్, మహమ్మద్ ముస్తఫా, కిలారి వెంకట రోశయ్యతో కలసి పాల్గొన్నారు. ముఖ్యమంత్రి జగన్ విజయవాడలో రాష్ట్రవ్యాప్తంగా వాలంటీర్ల వందనం కార్యక్రమం లాంఛనంగా ప్రారంభించిన కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారంను వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాల లబ్ధిని అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి అందించాలన్న లక్ష్యంతో సచివాలయ, వాలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేశారని, ప్రభుత్వ సేవలు పారదర్శకంగా, వేగ వంతంగా అందించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని గ్రామ, వార్డు వాలంటీర్లు 35 మందికి సేవా వజ్రా, 134 మందికి సేవా రత్న, 9897 మందికి సేవా మిత్రా పురస్కారాలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువులు ప్రజా ప్రతినిధులు వాలంటీర్ల సేవలను కొనియాడారు. సేవా వజ్రా, సేవా రత్న, సేవా మిత్రా అవార్డులను పొందిన వాలంటీర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్‌ల ఛైర్మన్‌లు, డీఆర్వో చంద్రశేఖరరావు, జడ్పీ సీఈఓ మోహనరావు, డిప్యూటీ మేయరు సజీలా, వాలంటీర్లు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారించకుంటే కార్పొరేషన్‌ను ముట్టడిస్తాం

విశాలాంధ్ర-గుంటూరు : మూడు నెలలుగా తాగటానికి గుక్కెడు మంచినీరు దొరక్క గొంతు ఎండుతుంది... ఎమ్మెల్యేకు, కార్పొరేటర్‌కు ఎన్నిసార్లు చెప్పినా చేస్తాం చూస్తాం అంటూ కాలం వెళ్లబుచ్చుతున్నారే కానీ పరిష్కారం చూపడం లేదు... నగరపాలక సంస్థ అధికారులను కలిసి తమ గోడు వినిపించుకున్నా కనీసం వినతిపత్రం కూడా తీసుకోలేదని కోదండరామయ్య కాలనీ వాసులు జనసేన పార్టీ అర్బన్ అధ్యక్షుడు సురేష్ ఎదుట తమ గోడుని వినిపించుకున్నారు. మూడు నెలలుగా 21వ డివిజన్ పరిధిలోని కోదండరామయ్య కాలనీలో మంచినీటి ఎద్దడి నెలకొన్న సందర్భంగా జనసేన పార్టీ నేతలు శుక్రవారం ఆ ప్రాంతంలో పర్యటించారు. స్థానిక ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎండలు మండిపోతున్నాయి ఉక్కపోతతో అల్లాడుతున్నామని, మరోవైపు మంచినీళ్ళు ఎప్పుడు వస్తాయో తెలియక నిద్రాహారాలు మాని కూర్చోవలసి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పుడో అర్ధరాత్రి ఒక పది నిముషాలు మాత్రమే వస్తాయని మండిపడ్డారు. కంటితుడుపు చర్యగా వాటర్ ట్యాంక్ పంపిస్తారని దీనివల్ల మాకు ఎలాంటి ఉపయోగం లేదని తమకు శాశ్వత పరిష్కారం కావాలన్నారు. ఈ సందర్భంగా నేరేళ్ళ సురేష్ స్పందిస్తూ ప్రజలకు కనీస సదుపాయాలు కల్పించలేని సంక్షేమం దేనికని ప్రశ్నించారు. వాటర్ డీఈతో మంచినీటి సమస్యపై మాట్లాడారు. ఆదివారంలోపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోతే ఖాళీ బిందెలతో కార్పొరేషన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆళ్ళ హరి, కొడగంటి రవి, మెహబూబ్ బాషా, పులిగడ్డ గోపి, చెన్నం శ్రీకాంత్, సయ్యద్ షర్ఫుద్దీన్, పవన్ హరి, పఠాన్ షరీఫ్, కగ్గా సాయి, ప్రతాప్, రామకృష్ణ, వడ్డె సుబ్బారావు, స్థానికులు పాల్గొన్నారు.

రీకౌంటింగ్ వారికీ అవకాశం కల్పించాలి

విశాలాంధ్ర-గుంటూరు : పాఠశాల విద్యలో రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన జగనన్న ఆణిముత్యాలు అవార్డుల ఎంపికలో ఇంటర్‌మీడియట్, పదవ తరగతి విద్యార్థులలో అత్యధిక మార్కులు వచ్చిన ముగ్గురుకి ప్రోత్సాహకాలు, బహుమతులు ఇవ్వడం చాలా సంతోషదాయకమని ఏపీటీఎఫ్(1938) జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సుబ్బారావు ఒక ప్రకటనలో అన్నారు. అయితే ఇటీవల రీవెరిఫికేషన్/రీకౌంటింగ్‌కు వెళ్లిన పదవ తరగతి విద్యార్థులకు కూడా అవకాశం కల్పించాలని, ఆ మేరకు సదరు ప్రక్రియను వేగవంతం చేసి, వారికి అవకాశం కల్పించాలని కోరారు.

ఆర్కే సహకారంతో బల్ల రిక్షాలు అందజేత

విశాలాంధ్ర-దుగ్గిరాల : మండల పరిధిలోని చుక్కపల్లివారిపాలెంకు చెందిన మంద్రు అబ్రహం, పెరకలపూడి గ్రామానికి చెందిన దానబోయిన సుబ్బారావులకు శుక్రవారం బల్ల రిక్షాలు అందజేశారు. నిరుపేద కుటుంబాలకు చెందిన వీరు.. వారి గ్రామాలలో సోడాలు, కొబ్బరి కాయలు అమ్ముకుంటూ తమ చిరు వ్యాపారానికి సరైన వసతి లేదని స్థానిక నాయకుల ద్వారా ఎమ్మెల్యే ఆర్కేకు తమ ఇబ్బందిని తెలియజేయగా స్పందించిన ఆయన వెంటనే ఫ్లాట్ ఫారం రిక్షాలను అందించారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు, పెరుకలపూడి సర్పంచ్ గంపల గంగాధర్, వైసీపీ నాయకులు నూతలపాటి కేశవరావు, జమ్ముల లోకేష్, ఉయ్యూరు మారుతి, ఆళ్ళ మహేష్, కర్ప్యూరావ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి బుద్ధి చెప్పేలా పాలన సాగించాలి

విశాలాంధ్ర-గుంటూరు : ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బీజేపీకి బుద్ధి చెప్పేలా కర్నాటకలో కాంగ్రెస్ పార్టీ పాలన సాగించాలని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం నేషనల్ వైస్ ఛైర్మన్ జమీల్ అహ్మద్ బేగ్ ఒక ప్రకటనలో కోరారు. కర్నాటక కాంగ్రెస్ పార్టీ శాసనసభాపక్ష నాయకునిగా, ముఖ్యమంత్రిగా ఎంపికై ప్రమాణ స్వీకారం చేయనున్న సిద్ధా రామయ్యకు జమీల్ అహ్మద్ బేగ్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్నికల మానిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజారంజక పాలన అందజేయాలని ఆకాంక్షించారు.

పుస్తక పఠనంతో మేధస్సుకు పదును

విశాలాంధ్ర-ప్రత్తిపాడు : వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ప్రత్తిపాడు గ్రంథాలయాన్ని గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం ద్వారా గొప్ప గొప్ప మేధావులు తమ వ్యక్తిత్వాన్ని పెంచుకున్నారని చెప్పారు. సెల్ ఫోన్ వాడకం తగ్గించి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని సూచించారు. వేసవి శిక్షణ శిబిరాలను ఉపయోగించుకొని ఎక్కువ మంది పిల్లలు మంచి విజ్ఞానవంతులుగా ఎదగాలని ఆయన కోరారు. అనంతరం గ్రామ పెద్దలు, గ్రంథాలయ అధికారి బి.అరుణ దేవానంద్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు తగదు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: రాష్ట్రాన్ని సంక్షేమంగా, పేదల ప్రజల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని విమర్శించే స్థాయి జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కి లేదని, ఆయన సినిమాలకు తప్పా రాజకీయాలకి ఏ మాత్రం పనికిరాడని వైసీపీ నాయకులు బోరుగడ్డ అనిల్ కుమార్ అన్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాపం పసివాడు అంటూ ముఖ్యమంత్రి ఫొటో పెట్టి ట్వీట్ చేసిన నేపథ్యంలో అనిల్‌కుమార్ ఘాటుగా స్పందించారు. రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో త్వరలో పవన్ కల్యాణ్‌పై సినిమాలు తీయబోతున్నట్లు చెప్పారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా పేద ప్రజల సంక్షేమ ధ్యేయంగా సుపరి పాలన అందిస్తున్నారని అన్నారు.

రేపు అన్నమయ్య గ్రంథాలయ సందర్శన యాత్ర

విశాలాంధ్ర-గుంటూరు : అన్నమయ్య గ్రంథాలయ సందర్శన యాత్రకు ఈ నెల 21న శ్రీకారం చుట్టినట్లు ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షులు సోమేపల్లి వెంకట సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్, కార్యదర్శి ఎస్ఎం సుభాని ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు రాష్ట్రాలలోని రచయితలు, కవులు, సాహితీవేత్తలతో వేలాది పుస్తక సంపదను కలిగి ఉన్న గుంటూరులోని అన్నమయ్య గ్రంథాలయ సందర్శన యాత్రను ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఏర్పాటు చేసిందన్నారు. ఆంధ్రప్రదేశ్ ఘనకీర్తిని చాటేవిధంగా 77 మంది కవులతో తీర్చిదిద్దిన 'మన ఆంధ్రప్రదేశ్' కవితా సంకలాన్ని ప్రఖ్యాత కవి, విమర్శకులు డాక్టర్ పాపినేని శివశంకర్ ఆవిష్కరిస్తారని, పొన్నూరు వెంకట శ్రీనివాసులు సమీక్ష చేస్తారని, డాక్టర్ ఉప్పలధడియం వెంకటేశ్వర హైకు సంపుటి 'విత్తనం'ను ప్రముఖ కవి అడిగోపుల వెంకటరత్నం ఆవిష్కరిస్తారని చెప్పారు.

పేదలను నట్టేట ముంచుతున్న జగన్

విశాలాంధ్ర-పొన్నూరు : సెంటు స్థలాల పేరుతో వేలాది మంది పేదలను జగన్‌మోహన్ రెడ్డి మోసం చేస్తూ నట్టేట ముంచుతున్నారని పొన్నూరు తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు కనీసం మూడు సెంట్లు ఇవ్వాలన్నదే తెలుగుదేశం విధానమన్నారు. జగన్‌కు మాత్రం వందలాది ఎకరాల్లో ప్యాలస్‌లు కావాలి, పేదలకు మాత్రం మూడు సెంట్లు స్థలం కూడా ఇంటికి ఇవ్వరా? అది కాకుండా హక్కులు లేని సెంటు స్థలాలు ఇచ్చి పేదలను నిట్టనిలువునా మోసం చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు వైసీపీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే... ప్రశ్నించినందుకు ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. దీనిని నిరసిస్తూ పొన్నూరు సెంటర్లో జగన్‌మోహన్ రెడ్డి దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేశారు. ఈ కార్యక్రమంలో పొన్నూరు పట్టణ, మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎరువులపై రూ.1.08 లక్షల కోట్ల సబ్సిడీ

విశాలాంధ్ర-ప్రత్తిపాడు : ఈ ఏడాది ఎరువుల ధరలు పెంచకూడదని కేంద్ర మంత్రివర్గం నిర్ణయంపై భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా టొబాకో సెల్ స్టేట్ కో కన్వీనర్ జంధ్యాల వెంకట రామలింగేశ్వర శాస్త్రి హర్షం వ్యక్తం చేశారు. గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ సంవత్సరం ఎరువులకు రూ.1.08 లక్షల కోట్ల సబ్సిడీని ప్రకటించిన కేంద్రం రైతులకు మహోపకారం చేసిందని ఆయన తెలిపారు. యూరియాకు రూ.70 వేల కోట్లు సబ్సిడీ ఇస్తున్నట్లుగా కేంద్రం ప్రకటించడం రైతాంగానికి ఆర్థికంగా సహకరించారన్నారు.

చంద్రబాబు దిష్టిబొమ్మ దగ్ధం

విశాలాంధ్ర-పొన్నూరు : అమరావతిలో పేదలకు పంపిణీ చేస్తున్న ఇళ్ల స్థలాలపై సెంటు భూమి శవాన్ని పూడ్చిపెట్టడానికి కూడా సరిపోదని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు హేళనగా మాట్లాడటంపై ఆయన దిష్టిబొమ్మను ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలతో కలిసి వైసీపీ నాయకులు పొన్నూరు పట్టణంలోని అంబేద్కర్ సెంటర్లో శుక్రవారం దహనం చేశారు. ఈ సందర్భంగా పొన్నూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పేదలకు అమరావతి రాజధాని ప్రాంతంలో నివసించడానికి అర్హత లేదా అని టీడీపీ నాయకులను ప్రశ్నించారు. ప్రభుత్వం పేదలందరికీ నివాస స్థలాలు ఉండాలనే ఆశయంతో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తుంటే కోర్టులకు వెళ్లి అడ్డుకుంటున్న చంద్రబాబు నాయుడు ధనికుల పక్షపాతిగా మరోసారి నిరూపించుకున్నాడన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ వర్గాల పలువురు నాయకులు పాల్గొని మాట్లాడారు.

ఎఫ్‌సీఐలో ఏఐటీయూసీ జెండా ఆవిష్కరణ

విశాలాంధ్ర-తాడేపల్లి : ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి కృష్ణాకెనాల్ జంక్షన్ ఎఫ్‌సీఐ ఫుడ్ గూడెంలో మేడే వారోత్సవాలు ముగింపు సందర్భంగా ఏఐటీయూసీ మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షులు కంచర్ల కాశయ్య ఏఐటీయూసీ జండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాశయ్య మాట్లాడుతూ ఎందరో త్యాగఫలం మేడే అన్నారు. మేడే ఇచ్చిన స్ఫూర్తితో కార్మికులు అనేక చట్టాలు, హక్కులు రాజ్యాంగం ద్వారా సాధించుకున్నారని అన్నారు. నేడు దేశంలో మోదీ పాలనలో ఆ హక్కులు, చట్టాలకు విఘాతం కలిగించే విధంగా ప్రయత్నిస్తోందన్నారు. కార్మిక, కర్షకులు ఐక్యం చేసి వారి హక్కులను కాపాడుకునే విధంగా ఏఐటీయూసీ వారికి అండగా ఉంటోందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలకు తూట్లు పొడుస్తూ అధిక ధరలు, పన్నుల భారాలను ప్రజల నెత్తిన మోపాయని తెలిపారు. ఆల్ ఇండియా ఎఫ్‌సీఐ వర్కర్స్ యూనియన్ సెంట్రల్ కమిటీ మెంబర్ దానబోయిన సుందరరావు యాదవ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయన్నారు. సీఎం నివాసముండే తాడేపల్లి ఎఫ్‌సీఐలో కార్మికులకు పనులు లేకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యమంత్రి తక్షణమే చొరవ తీసుకుని కార్మికులకు పనికల్పించే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి ఏఐటీయూసీ సీనియర్ నాయకులు తుడిమెల్ల వెంకటయ్య, బత్తుల నాగయ్య, దాసు, కె.తిరుతమ్మ, మరియమ్మ, సుధాకర్, కాశీంబి, సత్యవతి, ప్రమీల, డి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజల అవస్థలు

విశాలాంధ్ర-గుంటూరు : రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో నిరంతరం విద్యుత్ సరఫరా అందించాల్సిన అధికారులు అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలను అవస్థలకు గురిస్తున్నారని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి అసహనం వ్యక్తం చేశారు. ఈ మేరకు డీసీసీ అధ్యక్షులు లింగంశెట్టి ఈశ్వరరావు, నగర అధ్యక్షులు షేక్ ఉస్మాన్ ఆధ్వర్యంలో నగరంలోని పొన్నూరు రోడ్డులో ఉన్న విద్యుత్ భవన్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మస్తాన్‌వలి మాట్లాడుతూ వేళ పాళ లేకుండా విధిస్తున్న కరెంట్ కోతలతో వృద్ధులు, చిన్నారులు అవస్థలు పడుతున్నారని అన్నారు. ఉష్ణోగ్రతలు పెరుగుతాయని ముందే తెలిసినప్పటికి విద్యుత్ పెంచుకోవడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు. సర్‌చార్జీల పేరుతో ప్రజలు జేబులు ఖాళీ చేస్తున్న ప్రభుత్వానికి విద్యుత్ కోతలతో ప్రజలు పడే ఇబ్బందులు తెలియడం లేదా అని ప్రశ్నించారు. అనంతరం వినతిపత్రాన్ని అందజేశారు. సందీప్, జవహర్ బాబు, చెన్నంశెట్టి సాంబశివరావు, సయ్యద్ జాని గోల్డ్, సుంకర నాని, సుధీర్ బాబు, సయ్యద్ సుభాని, కరీమ్, మీర్ మహబూబ్ అలీ, మెహబూబ్, బోడపాటి శ్రీను, ఎండీ ఉస్మాన్, వాల్మీకి శ్రీనివాస్, దేవరపు శ్రీనివాస్, శ్రీను, గోళ్ళ విజయ్, భాగ్యరాజ్, షేక్ గౌస్, తిరుమల రావు, మస్తాన్, మీరావలి, కిక్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో 'కేడావర్ ఆర్థోస్కోపీ సర్జరీ'

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : క్లిష్టమైన శస్త్ర చికిత్సలు పీజీ వైద్య విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు సీఎంఈ ఎంతో ఉపయోగమని మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉమాజ్యోతి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి అన్నారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర (జీజీహెచ్)ఆసుపత్రి ఆర్థోపెడిక్ విభాగంలో మోకాలు గాయల ఆర్థోస్కోపీ సర్జరీ రాష్ట్ర స్థాయి వైద్య విద్యా కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి డాక్టర్ ఉమాజ్యోతి, డాక్టర్ నీలం ప్రభావతి ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎంఈ వంటి కార్యక్రమాలు వలన పీజీ వైద్య విద్యార్థులకు వృత్తి నైపుణ్యం పెరుగుతుందన్నారు. అనంతరం శవాగారంలో నాలుగు మృత దేహాలుపై మోకాలు లోపల నరాలు తెగినప్పుడు..ఆర్థోస్కోపీ ద్వారా సర్జరీ చేసే విధానంపై మెలుకువలను సీనియర్ వైద్యులు పీజీ వైద్య విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు వరప్రసాద్, ఎస్ఎస్‌వి రమణ, డాక్టర్ వీవీ నారాయణరావు, డాక్టర్ అద్దేపల్లి శ్రీనివాస్, డాక్టర్ ఎస్.అమరనాథ్, డాక్టర్ శివకుమార్, డాక్టర్ పాపారావు, డాక్టర్ జగన్‌మోహన్ రెడ్డి, డాక్టర్ సందీప్, డాక్టర్ చెతన్య, డాక్టర్ సతీష్‌బాబు, డాక్టర్ మృదుల పాల్గొన్నారు.

జగన్‌ను విమర్శించే స్థాయి టీడీపీకి లేదు

విశాలాంధ్ర-చేబ్రోలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు నివేశ స్థలాలు ఇస్తుంటే చంద్రబాబు ఓర్వలేకపోతున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు కుర్రా పాములు మండిపడ్డారు. చేబ్రోలు పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలకు పట్టణంలో 1 సెంటు, గ్రామీణ ప్రాంతాలలో సెంటున్నర స్థలం ఇస్తే చంద్రబాబుకు నిద్ర పట్టటంలేదని విమర్శించారు. పేదలకు ఇచ్చిన స్థలాలను స్మశాన వాటికలతో చంద్రబాబు పోల్చటం సిగ్గు చేటన్నారు.అనంతరం చంద్రబాబు దిష్ట బొమ్మను తగలబెట్టరు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కిరణ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరుల పాల్గొన్నారు.

'ఆర్వో మంచినీటి కూలర్' ప్రారంభం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు ప్రభుత్వ సమగ్ర (జీజీహెచ్)ఆసుపత్రిలో ఓపీ బ్లాక్ వద్ద బసవపున్నయ్య జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఆర్వో మంచినీటి కూలర్‌ను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి శుక్రవారం ప్రారంభించారు. ఆసుపత్రికి వచ్చే రోగుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని గుంటజూరు శ్రీనగర్‌కు చెందిన పట్టపు గోపి రూ.50వేలు విలువ గల మంచినీటి కూలర్‌ను జీజీహెచ్‌కు బహూకరించడం అభినందనీయమని కొనియాడారు. ప్రజలు ఆ మంచినీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ సతీష్ కుమార్, డిప్యూటీ ఆర్ఎంఓ. డాక్టర్ ఝాన్సీ, శానిటేషన్ అధికారి దొంతిరెడ్డి శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ దిష్టిబొమ్మ దహనం

విశాలాంధ్ర-చేబ్రోలు: సీఎం జగన్ పేదలను చిన్న చూపు చూస్తున్నారని టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రం చేబ్రోలులోని గాంధీ బొమ్మ వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. పేదలకు సీఎం సెంటు స్థలం ఇస్తున్నారని దీని లో పేదలకు ఏ విధంగా ఇండ్ల నిర్మాణం చేసుకుంటారు అని ప్రశ్నించారు. పేదల పక్షాన మాట్లాడితే వారి పై అక్రమ కేసులు పెట్టటం వైసీపీకి అలవాటుగా మారిందని విమర్శించారు. ఈకార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు మైలా రామరాజు, రాజా తదితరులు పాల్గొన్నారు.

మరణం ఎరుగని విప్లవ సంకేతం హోచిమిన్

విశాలాంధ్ర, తెనాలి : హోచిమిన్ అంటే వియత్నాం విప్లవం-విప్లవ జీవితం తప్ప వ్యక్తిగత జీవితం లేని మహోన్నత విప్లవనేత హోచిమిన్ అని వక్తలు ఆయనకు నివాళులు అర్పించారు. ఇండియన్ సొసైటి ఫర్ కల్చరల్ కో-ఆపరేషన్ అండ్ ఫ్రెండ్‌షిప్ (ఇస్కఫ్) ఆధ్వర్యంలో గాంధీనగర్ ఇస్కఫ్ కార్యాలయంలో హోచిమిన్ 133వ జయంతి వేడుకలు శుక్రవారం జరిగాయి. సభకు ఇస్కఫ్ రాష్ట్ర నాయకులు బొల్లిముంత కృష్ణ అధ్యక్షత వహించారు. కొల్లిపర సిపిఐ నాయకులు తుంగా బాలస్వామి స్వాగతం పలికి మాట్లాడుతూ హోచిమిన్ దేశభక్తితో విప్లవాన్ని ప్రారంభించి వియత్నాం దేశానికి విముక్తి చేయడమేగాక దానిని సోషలిస్టు రాజ్యంగా తీర్చిదిద్దారని ఆయనకు జోహార్లర్పించారు. పారిశ్రామికులు కోట పవన్‌కుమార్ మాట్లాడుతూ విప్లవాలు ప్రజానాయకులను, త్యాగధనులను ముందుకు తెస్తాయని అటువంటి వారిలో అత్యున్నత స్థాయికి చెందిన అంతర్జాతీయ విప్లవనేత హోచిమిన్ అని అన్నారు. అధ్యక్షత వహించిన కృష్ణ మాట్లాడుతూ వియత్నాం విప్లవం ప్రధానంగా రెండు దశలుగా జరిగిందన్నారు. 1930 నుండి 1945 వరకు, 1945 ఆగష్టులో విప్లవం జయప్రదం అయి ఉత్తర వియత్నంలో ప్రజాతంత్ర రిపబ్లిక్‌కు వియత్నం వర్కర్స్ పార్టీ స్థాపించి నాటి నుండి వియత్నంలో సోషలిస్టు వ్యవస్థ ప్రారంభమైందన్నారు. ఇస్కఫ్ జిల్లా కార్యదర్శి మునిపల్లి శ్రీకాంత్ మాట్లాడుతూ ఎల్లకాలాలకు హోచిమిన్ జీవితం ఆదర్శప్రాయమన్నారు. అవినీతి, స్వార్థం, వ్యక్తిగత ప్రయోజనాలు లేకుండా ప్రజాహితంగా పరిపాలన సాగిస్తున్న దేశం వియత్నాం నేటికి అదే పంథాలో కొనసాగుతుందని చెప్పారు. విప్లవ ఉద్యమాల మీద విస్తారంగా ప్రభావితం చూపుతున్న నేటి తరుణంలో వీటికి వ్యతిరేకంగా కార్యకర్తలకు మనోధైర్యాన్ని కల్పించడానికి వియత్నం ప్రజల వీరోచిత విప్లవ పోరాటాల చరిత్రను దాన్ని నడిపిన హోచిమిన్ జీవితాన్ని నేటి తరం తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన స్ఫూర్తితో నేటి తరం పయనించాలన్నారు. సభా ప్రారంభంలో హోచిమిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో వెనిగళ్ల నారాయణ శివప్రసాద్ (శివాజి ప్రెస్), మార్కండేయులు తదితరలు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థలను సీజ్ చేయాలి

విశాలాంధ్ర, తెనాలి : పాఠ్య పుస్తకాలు అమ్ముతూ, ప్రభుత్వ నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని జిల్లా అధ్యక్ష కార్యదర్శి పాశం వెంకటేష్, బందెల నాసర్‌జీలు డిమాండ్ చేశారు. తెనాలి సిపిఐ కార్యాలయంలో శుక్రవారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్0 ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారం చేస్తూ విద్యపేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుండి లక్షల రూపాయలు దోచుకుంటున్నారని అది విరమించుకోవాలని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్ విద్యాసంస్థలు ఇంటర్మీడియట్ బోర్డు రూల్స్ పాటించకుండా, అనుమతులు లేని భవనాలలో కళాశాలలను, పాఠశాలలను నిర్వహిస్తున్నారన్నారు. వేసవి సెలవుల్లో కూడా క్లాసులు నిర్వహిస్తూ విద్యార్థులను మానసిక ఒత్తిడి గురిచేస్తున్నారని చెప్పారు. ఈనెల 28 నుండి 30 వరకు ఎఐఎస్ఎఫ్ కోస్తాంధ్ర రాజకీయ శిక్షణ తరగతులు జరగనున్నాయని పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో అరవింద్, నీరజ్ సాయి, శ్రీను, కోలా శేఖర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీని సందర్శించిన డిల్లీ ఎన్క్వాస్ టీమ్

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి గణపతి నగర్ డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను శుక్రవారం ఢిల్లీ నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్క్వాస్) టీమ్ సందర్శించింది. టీమ్ ప్రతినిధులు డాక్టర్ సంజీవరావు, డాక్టర్ స్వాతి లక్ష్మి హెల్త్ సెంటర్లోని 12 రకాల వైద్య ఆరోగ్య సౌకర్యాలను 19, 20 తేదీలలో రెండు రోజులు పరిశీలిస్తారు. తొలి రోజు శుక్రవారం మెడికల్ ఆఫీసర్ గది, లేబరేటరీల పరిశీలనతో ప్రారంభించారు. హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.అనూష టీమ్ ప్రతినిధులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా హెల్త్ సెంటర్ పునాది వేసినప్పటినుంచి పూర్తిగా అభివృద్ధి చెందిన విధానం, హెల్త్ సెంటర్‌లోని వైద్యసేవలు, హెల్త్ సెంటర్ చేపట్టిన ఆరోగ్య కార్యక్రమాలు, హెల్త్ సెంటర్‌ను సందర్శించిన ప్రజాప్రతినిధులు, రాష్ట్ర స్థాయి అధికారుల వివరాలను వారికి వివరించారు. ఈ సందర్భంగా హెల్త్ సెంటర్ ఆవరణలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలైన మలేరియా, లెప్రసీ, టీబీ, జాతీయ మహిళా శిశు సంక్షేమ శాఖకు సంబంధించిన జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను టీమ్ ప్రతినిధులు సందర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్క్వాస్ టీమ్ పరిశీలిస్తున్న తొలి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ మంగళగిరి గణపతి నగర్‌ది కావటం విశేషం. అయితే దేశంలో ఎన్క్వాస్ టీమ్ పరిశీలించిన హెల్త్ సెంటర్‌లలో తొలిసారిగా జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన పరుస్తూ స్టాల్స్ ఏర్పాటు చేసిన హెల్త్ సెంటర్ కూడా కావడం మరో విశేషం. ఈ కార్యక్రమంలో ఆరోగ్యం కుటుంబ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ విజయలక్ష్మి, స్టేట్ కన్సల్టెంట్ డాక్టర్ నరేంద్ర, జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ రాంప్రసాద్, డిస్ట్రిక్ట్ క్వాలిటీ ఆఫీసర్ డాక్టర్ వాసు దేవరాజు, మలేరియా సబ్ యూనిట్ అధికారి ఏ.శ్రీమన్నారాయణ, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ జోసెఫ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

దళిత ద్రోహి చంద్రబాబు

విశాలాంధ్ర-తాడికొండ : దళితులను చులకనగా మాట్లాడుతున్న నారా చంద్రబాబు నాయుడు దళిత ద్రోహి అని వైసీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. రాజధానిలో పేదలకు సెంటు భూమి ఇళ్ల స్థలం ఇస్తుంటే ఇది ఓర్వలేని చంద్రబాబు శవాలను పెట్టుకోవడానికి కూడా సెంటు భూమి చాలదని వ్యంగ్యంగా దళితులను అవమానపరిచే రీతిలో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బాబు జగజీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన తెలిపారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. చంద్రబాబు విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. డౌన్ డౌన్ చంద్రబాబు దళిత ద్రోహి చంద్రబాబు అంటూ నినాదాలు చేశారు. చంద్రబాబు మాటలు నమ్మి మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ మైనార్టీల కాలనీలో గడపగడప కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీవాసులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచి తోకల సరోజినీ నరసింహారావు, ఉప సర్పంచ్ ఉయ్యూరు వెంకటరెడ్డి, వైసీపీ నాయకులు బండ్ల పున్నారావు, ధూళిపాళ్ల నాగేశ్వరరావు, నూతక్కి పరిమళ, ఆళ్ల హనుమంతరావు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

తాడేపల్లి, సహోదయ కాలనీ, లూథరన్ చర్చి దగ్గర, డోర్ నెం. 404-ఎ, 4వ అంతస్తు, శ్రీ చక్ర రెసిడెన్సి కాపురస్తులు **జి. మేరీ కమల**, తండ్రి **జి.కృపానందం** అను నేను నా పేరిట గల పాస్‌పోర్ట్ నెం. **HYDR12114592** యనమలకుదురు నుండి తాడేపల్లికి ఇల్లు మారుతుండగా మార్గమధ్యలో పోయినది. ఎవరికైనా దొరికిన యెడల ఈ నెంబర్‌కు తెలియజేయగలరు.

సెల్ : 9989428953

గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

విశాలాంధ్ర-పెదనందిపాడు : విజ్ఞానదాయక సమాజ నిర్మాణానికి గ్రంథాలయాలు వారధిగా ఉపయోగపడుతున్నాయని, అలాంటి గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని గ్రంథాలయ సంస్థ గుంటూరు జిల్లా చైర్మన్ బత్తుల దేవానంద్ తెలిపారు. పౌర గ్రంథాలయ సంస్థ, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో శాఖా గ్రంథాలయంలో ఈ నెల 8 నుంచి నిర్వహించనున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న విజ్ఞాన శిబిరంలోని అంశాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 98 శాఖా గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వహకురాలు పి.సుభాషిని, పత్తిపాడు గ్రంథాలయ నిర్వహకురాలు బి.అరుణ, ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు గేరా మోహనరావు, విశ్రాంత ఉద్యోగులు గారపాటి రమేష్, గుగ్గిలం సాయిబాబు, పుసులూరు పుస్తక పంపిణీ కేంద్ర నిర్వాహకులు ఎస్.వెంకటేశ్వర్లు, మంజుల తదితరులు పాల్గొన్నారు.

క్రిస్టియన్ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారునిగా బాలస్వామి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ క్రిస్టియన్ వ్యవహారాల రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా డాక్టర్ మద్దు బాలస్వామిని ప్రభుత్వం నియ మించింది. మైనార్టీ వెల్ఫేర్ సెక్రెటరీ ఎండి ఇంతియాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన దగ్గర నుండి రెండు సంవత్సరాలపాటు ఆయన ఈ పదవి కాలంలో కొనసాగుతారని ఉత్తర్వులులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మద్దు బాలస్వామి మాట్లాడుతూ రానున్న రోజుల్లో రాష్ట్రంలోని క్రైస్తవుల సమస్యలు, వారి అభివృద్ధికి అవసరమైన అంశాలను పరిగణంలో తీసుకొని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి క్రైస్తవుల అభివృద్ధి అభ్యున్నతికి పాటుపడే విధంగా తాను కృషి చేస్తానని అన్నారు.

ఘనంగా కార్పొరేటర్ పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని సమ్మర్‌పేట నందు 41వ డివిజన్ వైసీపీ కార్పొరేటర్ బొడ్డుపల్లి స్మితా పద్మజ పుట్టినరోజు వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ స్మితా పద్మజ వైసీపీ కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు నడుమ కేక్ కట్ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైసిపి కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, బంధువుల మధ్య పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తనను కార్పొరేటర్ స్థాయికి తీసుకొచ్చిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలియజేశారు. స్థానిక ఎమ్మెల్యే సుచరిత అండదండలతో గుంటూరు కార్పొరేషన్‌లోని వార్డులన్నింటిలోకెల్లా 41వ వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో 41వ డివిజన్ అధ్యక్షులు అంకం. అరుణ్ తదితరులు ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ సమర్థంగా అమలు చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని దళిత గిరిజన బడ్జెట్ వాచ్ రాష్ట్ర కన్వీనర్ అల్లడి దేవకుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక అరండల్‌పేటలో ఉన్న ఎస్సీ, ఎస్టీ రైల్వే ఉద్యోగుల భవనంలో "దళిత గిరిజన బడ్జెట్ వాచ్'జిల్లా స్థాయి విస్తృత సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా దేవకుమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని చిత్తశుద్ధితో అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులపై ఎంతైనా ఉందన్నారు. సబ్‌ప్లాన్ నిధులు కేటాయిస్తున్న అన్ని శాఖల్లో ఎస్సీ, ఎస్టీలకే ఖర్చు చేసి వారి కటుంబాలు అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. దళిత గిరిజన బడ్జెట్ వాచ్ గుంటూరు జిల్లా అధ్యక్షులు డి.చంద్రానాయక్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం వచ్చి 10 సంవత్సరాలు పూర్తయినప్పటికీ గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీలు అధ్వాన్న స్థితిలో మగ్గుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్ళించకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశానికి మల్లెల చిన్నప్ప అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో దళిత గిరిజన బడ్జెట్ వాచ్ నాయకులు బి.రమణమూర్తి, హేమలత, దాసరి థామస్, చంద్రశేఖర్, భగవాన్‌దాస్, రమేష్, రవితేజ, ప్రజా సంఘాలు, స్వచ్ఛంధ సేవా సంస్థ ప్రతినిధులు, ఎన్‌జీఓస్ ప్రతనిధులు పాల్గొన్నారు.

వృద్ధ తల్లులకు చీరల పంపిణీ

విశాలాంధ్ర-ప్రత్తిపాడు : కనెక్షన్స్ సహకారంతో పాస్టర్ ఎన్.లూథర బాబు ఆధ్వర్యంలో వృద్ధ తల్లులకు, గర్భిణీలకు ఉచితంగా చీరలు పంచారు. ఈ కార్యక్రమంలో వలంటీర్ కొండారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నాక్షయింటు అయిన జోగు శేషగిరిరావు గారి కుమారుడు వీర వెంకట నాగ ప్రభాకరరావు గారి సుచనల మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా, దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని జంపాని నాగేశ్వరరావుగారు విక్రయ దస్తావేజు నెం.5603/2010 యస్.ఆర్.ఓ. నల్లపాడు ద్వారా మెట్టు కోటిరెడ్డి వగైరాల వద్ద నుండి కొనుగోలుచేసి సర్వ హక్కులతో అనుభవించు చున్నారు. అట్టి ఆస్తిని నాక్షయింటు కొనుగోలు చేయుటకు సదరు జంపాని నాగేశ్వరరావుగారితో ది.26-04-2023న ఒక అన్ రిజిష్టర్డ్ అగ్రిమెంట్ ఆఫ్ సేల్‌ను కుదుర్చుకొని యున్నారు. సదరు ఆస్తికి చెందిన ఒరిజినల్ లింకు దస్తావేజులు అయిన విక్రయ దస్తావేజు మరియు రిజిష్టర్ రశీదు దస్తావేజు నెంబర్లు 5603/2010 & 6411/2010 యస్.ఆర్.ఓ నల్లపాడు గల దస్తావేజులు పోయినవని, దొరకలేదని చెప్పియున్నారు. కావున అట్టి ఆస్తిని నాక్షయింటు కొనుగోలుచేయుచున్నందున ఎవరికైనా పోయిన దస్తావేజుపై గాని, షెడ్యూలు ఆస్తిపై గాని, ఎవరికైనను ఏవిధమైన అభ్యంతరములు, క్లయిములు, సెక్యూరిటీలు, హక్కులు వగైరాలు వున్నచో 7 రోజుల లోపు వ్రాతపూర్వకంగా ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయవలెనని గడువులోపల ఎటువంటి క్లయిములు తెలియజేయనిచో నిష్పేచిఆస్తిగా భావించి లోను మంజూరు చేయబడునని మరియు గడువు అనంతరమువచ్చు ఆక్షేపణలు వగైరాలు నాక్షయింటుహక్కులను బైండుచేయజాలవు.
షెడ్యూలు:గుంటూరు డి॥, నల్లపాడు సబ్.డి॥, జి.యం.సి. ఏరియాలో చేరిన గుంటూరు సిటీ, తురకపాలెం మెయిన్ రోడ్డు, భాగ్యనగర్, 4వ లైను లొకాలిటీ బాపతు నల్లపాడు గ్రామ డి.నెం. 277/ఏరు మింజుమలె చ.గ.1099-32లు స్థలములో రోడ్డు వైండింగ్ క్రింద వదలిన చ.గ.57-77లు స్థలము పోను మిగిలిన చ.గ.1041.55లు స్థలము అందలి నిర్మించబడుచున్న "VIJAYA ENCLAVE" అపార్టుమెంట్ ఆస్తికి.హద్దులు: (సమీప డోరు నెం.2-14-8/27/101)తూర్పు:అ.25లు వెడల్పు గల రోడ్డు హద్దు,అ.189-06లు,దక్షిణం: నేలకుర్తి లక్ష్మి గారి ఆస్తి హద్దు అ.52లు,పడమర: నందిగం నారాయణ గారు విక్రయించిన ఆస్తిహద్దు అ.190లు ఉత్తరం: స్తంబాలగరువు టు తురకపాలెం పోవు మెయిన్ రోడ్డు హద్దు అ.52 లు.యీ హద్దుల మధ్య చ.గ.1041-55లు స్థలము నందలి అనిర్దిష్టపు, అవిభాజ్యపు భాగమైన చ.గ.40లు స్థల భాగమున్నూ, సదరు స్థల భాగమునకు గాను మొత్తం స్థలములో నిర్మింబడుచున్న "VIJAYA ENCLAVE" అపార్టుమెంట్ నందలి థర్డ్ ఫ్లోర్ లోని ఫ్లాట్ నెం.404రు చ.అ.1050లు విస్తీర్ణముగల ఫ్లాటుకు హద్దులు.తూర్పు:కారిడార్, దక్షిణం: స్టెయిర్ కేస్ & ఓపెన్ టు స్కై, పడమర: ఓపెన్ టు స్కై,ఉత్తరం: ఓపెన్ టు స్కై పై హద్దుల లోని యావత్ యాజిమెంట్ హక్కులతో సహా.

K.N.M. KISHORE, Advocate
3/2 Brundavan Gardens, Guntur. Cell :98485 70106.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

ప్రజల కష్టాలు ప్రత్యక్షంగా చూశాం: జీవీ

విశాలాంధ్ర-వినుకొండ: టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు. వినుకొండ నియోజకవర్గంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించామని జిల్లా టి.డి.పి అధ్యక్షులు జీవి ఆంజనేయులు అన్నారు. నియోజకవర్గంలోని ఇంటింటికి వెళ్లి ప్రత్యక్షంగా వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆ సమస్యలన్నింటినీ తీర్చాలని వైసీపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజలు పడుతున్న సమస్యలను గుర్తించామన్నారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో సేకరించిన జిల్లా పార్టీ కార్యాలయానికి పంపించారు. తక్షణమే ఈ సమస్యలను తీర్చాలని లేని పక్షంలో టిడిపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పీవీ సురేష్ బాబు, జరపాల గోవింద నాయక్, మీసాల మురళీ కృష్ణ యాదవ్, గోరంట్ల హనుమంతరావు, దాసరి కోటేశ్వరరావు, ఆకుమల్ల కాసిం, యూత్ జానీ, కర్నాటి వెంకటేశ్వర రెడ్డి, టిప్పిసెట్టి వెంకటేశ్వర్లు, పెసల వెంకట నారాయణ, బత్తుల గోవిందరాజులు, రియల్ ఎస్టేట్ జానీ, గోల్డ్ కరీముల్ల, సిద్ధార్థపు ఫరీద్, అజీజ్, ఆళ్ళ మన్నయ్య, నర్రా కిషోర్, కళింగ రాజు, కట్టెంపుడి బర్మా, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు సీపీఐ కార్యాలయంలో సమావేశం

విశాలాంధ్ర-నరసరావుపేట : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సమ్మేళనం జూన్ 13, 14, 15 తేదీలలో పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో జరుగనున్నట్లు రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేసుకొనుటకు భవిష్యత్తు కార్యక్రమాన్ని రూపొందించుకొనుటకు గాను ఈ నెల 20వ తేదిన సాయంత్రం 3 గంటలకు నరసరావుపేట సీపీఐ కార్యాలయంలో సమావేశం జరుగుతుందని చెప్పారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎ.మారుతివరప్రసాద్ హజరౌతారని చెప్పారు. ప్రతిఒక్కరూ సకాలంలో హాజరుకావాలని కోరారు.

ఇంటర్మీడియట్ ప్రవేశానికి దరఖాస్తులు

విశాలాంధ్ర-కారంపూడి: ఏపీ మోడల్ పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె నయోమి శుక్రవారం తెలిపారు. ఆంగ్లములో బోధనా మాధ్యమము ఉంటుందన్నారు. 2023-24లో ఎంపిసి, బైపిసి, ఎంఈసి, సిఈసి గ్రూపులలో చేరుటకు జూన్ 7వ తేది వరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని ఆమె అన్నారు. దరఖాస్తు రుసుము ఓసి, బిసి, ఈడబ్ల్యుఎస్ లకు రూ 200లు, ఎస్సీ, ఎస్టీ లకు రూ 150 అని తెలిపారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 10వ తరగతి చదివి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తుకు అర్హులన్నారు. 10 వతరగతి మార్కుల మెరిట్, రిజర్వేషన్ రూల్స్ ప్రకారం సీట్లు కేటాయిస్తామన్నారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

విశాలాంధ్ర-యడ్లపాడు: 50 శాతం సబ్సిడీ పై పచ్చిరొట్ట విత్తనాలు రైతుభరోసా కేంద్రాలలో అందుబాటులో వున్నాయని యడ్లపాడు వ్యవసాయ శాఖ అధికారి సీహెచ్ సరిత తెలియచేశారు. యడ్లపాడు ఆర్బీకె 1 నందు శుక్రవారం సాగుకు సమాయత్తం కార్యక్రమం నిర్వహించారు. హాజరైన రైతులకు సరిత పలు సూచనలు చేశారు. పంట మార్పిడి లో మెళుకువలు, పైర్ల ఎంపికలో జాగ్రత్తలు, డ్రోన్ ల వాడకంపై అవగాహన, తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కారుచోల హేమ, పంచాయతీ కార్యదర్శి శశికళ, యడ్లపాడు రెవెన్యూ అధికారి నల్లమోతు మధుసూదన రావు, వ్యవసాయ సహాయ అధికారి సుప్రియ, సిరి కల్చర్ సహాయకులు రామ్మోహన్, పలువురు రైతులు పాల్గొన్నారు.

నాదెండ్లలో గ్రామోదయం

విశాలాంధ్ర-నాదెండ్ల: రక్త హీనత ఉన్న ఉన్న చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవాలని నాదెండ్ల ప్రత్యేక అధికారి బెన్ని సూచించారు. మండలంలోని నాదెండ్ల గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో గ్రామోదయం కార్యక్రమం నిర్వహించారు. తర్వాత జాతీయ మహాత్మా ఉపాధి హామీ పథకంలో పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్, నాదెండ్ల సిడిపిఓ, ఎఈవోఆంజనేయులు, మెడికల్ ఆఫీసర్ శ్వేత, పంచాయతీ కార్యదర్శి సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

విశాలాంధ్ర-వినుకొండ: బొల్లావెంకటకోటయ్య సత్యవతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు బొల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ మా ఫౌండేషన్ ద్వార 2 నెలల నుండి పేదలకు ప్రతి శక్రవారం అన్నదానం చేస్తున్నామన్నారు. పేదలకు ప్రతిరోజు అన్నదానం చేయాలన్నదే మా ఫౌండేషన్ సంకల్పమన్నారు. ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న బంధువులకు,మిత్రులకు, శ్రేయోభిలాషులకూ ధన్యావాదాలు తెలిపారు. ఫౌండేషన్ అధ్యక్షులు బొల్లా రమేష్ బాబు, రామిరెడ్డి, శివాయదవ్, నరేంద్ర, నాగరాజు, బ్రహ్మం పాల్గొన్నారు.

చంద్రబాబుకు పేదలే బుద్ధి చెబుతారు

విశాలాంధ్ర-అమరావతి : పేదలంటే చిన్నచూపు చూస్తున్న చంద్రబాబుకు ఆ పేదలే వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెబుతారని పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. సెంటు భూమి శవాలు పూడ్చడానికే చాలదు అంటూ పేదల ఇళ్లపై చంద్రబాబు చేసిన అహంకార పూరిత వ్యాఖ్యలకు నిరసనగా అమరావతిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ప్రజలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం చేశారు. ర్యాలీలో పాల్గొన్న పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మొదట అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజలతో కలిసి అమరావతిలో ర్యాలీలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తోటల పెంపకంపై అవగాహన పెంచుకోవాలి

విశాలాంధ్ర-రెంటచింతల: పండ్ల తోటల పెంపకంపై అన్నదాతలు అవగాహన పెంచుకోవాలని గురజాల ఉద్యానాధికారి ఎం. మోహన్ కోరారు. స్థానికంగా ఫండ్ల తోటలు సాగుచేస్తున్న బోయపాటి ఇన్నారెడ్డి, వై సుధాకరరెడ్డి పొలాలను పరిశీలించారు. మామిడి, సీతాఫలం, ఎర్రజామ, సపోటా, డ్రాగన్ ఫ్రూట్, అంజీరా, నేరేడు, స్వీట్ ఆరంజ్, స్టార్ ఫ్రూట్స్, నల్లజామ మొక్కల గురించి విశదీకరించారు. పండ్ల మొక్కలకు సోకే తెగుళ్లు, నివారణ చర్యలను వివరించారు. పవన్, శంకర్, తిరుపతి నాయక్ ఉన్నారు.

హాస్టల్ భవనానికి సంజీవరెడ్డి పేరు పెట్టండి

విశాలాంధ్ర-గుంటూరు : గుంటూరు అమరావతి రోడ్డులో పురాతన భవనం స్థానంలో నూతనంగా నిర్మిస్తున్న మెడికల్ కళాశాల మెన్స్ హాస్టల్ భవనానికి మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి పేరు పెట్టాలని వైఎస్సార్ ఇంటలెక్చువల్ ఫోరం, అవర్ స్టేట్ అవర్ లీడర్ వ్యవస్థాపకులు జి.శాంతమూర్తి కోరారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డిని తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శాంతమూర్తి మాట్లాడుతూ 1958లో నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మెడికల్ కళాశాల హాస్టల్ భవనాన్ని ప్రారంభించారని, నేడు అది శిధిలావస్థకు చేరుకోవడంతో దానిని పడగొట్టి నూతన భవనాన్ని నిర్మిస్తున్నారని ఈ నేపథ్యంలో నీతికి, నిజాయితీకి నిదర్శనంగా ఉన్న నీలం సంజీవరెడ్డి పేరును ఆ భవనానికి పెట్టాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రంలో నిరంకుశ పాలనపై సీపీఐ నిరంతర పోరు

◆ సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్రబ్యూరో-పల్నాడు జిల్లా : రాష్ట్రంలో వైసీపీ నిరంకుశ పాలనపై సీపీఐ నిరంతరం పోరాటం చేస్తుందని ఇందులో భాగంగా రైతాంగ సమస్యల పరిష్కారం కోసం జూన్ నెల 13, 14, 15 తేదీల్లో పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కళాశాల ఆడిటోరియంలో రాష్ట్రస్థాయి రైతు సమ్మేళనం నిర్వహిస్తున్నామని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు పేర్కొన్నారు. నరసరావుపేట పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముప్పాళ్ళ మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు పెట్టుబడులు పెరిగిపోయి, పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని మరోవైపు ఆరుగాలం కష్టించి పండించిన పంటలు చేతికొచ్చేవేళ అకాల వర్షాలతో పంటలు తడిచిపోయి బాగా దెబ్బతిన్నాయని అన్నారు. గత మార్చి, ఏప్రిల్ నెలలో కురిసిన అకాల వర్షాలతో వరి, మొక్క జొన్న, మిర్చి, పసుపు ఇతర వాణిజ్య పంటల రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. ప్రభుత్వం నష్టపరిహారం అందజేయడంలో తాత్సారం చేస్తుందని, నిబంధనలతో రైతులను ఇబ్బందులు పాలుచేస్తుందని ముప్పాళ్ళ అన్నారు. రైతుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు పంటలు కొనుగోలు చేయలేకపడకేసాయన్నారు. నరసరావుపేటలో నిర్వహించే రాష్ట్రస్థాయి రైతు సమ్మేళనంలో రైతాంగ సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందిస్తామని అన్నారు.

14, 15 ఆర్థిక సంఘం నిధులను జమ చేయాలి..

రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన సర్పంచులు వారి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 14, 15 ఆర్థిక సంఘం నిధులను వెంటనే గ్రామ పంచాయతీలకు జమ చేయాలని ముప్పాళ్ళ డిమాండ్ చేశారు. ఇటీవల ప్రకాశం జిల్లాలో ఓ మహిళా సర్పంచి ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకుందని ముప్పాళ్ళ గుర్తుచేశారు. కాంట్రాక్టర్లు బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నారని, ఆర్థిక ఇబ్బందులతో ధర్నాలు, ఆందోళనలు చేస్తున్నారని, కాంట్రాక్టర్లకు వెంటనే బిల్లులు చెల్లించాలని అన్నారు. జిల్లా కార్యదర్శి మారుతీవరప్రసాద్ మాట్లాడుతూ కాంట్రాక్టర్లకు జగనన్న కాలనీలో ఇల్లు నేర్పించుకునే లబ్దిదారులకు ఇసుక, సిమెంట్ ఉచితంగా ఇవ్వాలని, ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు అందజేయాలని, పేదలకు నివాసయోగ్యమైన ఇళ్ల స్థలాలను ఇవ్వాలని, పట్టణాల్లో రెండు సెంట్లు, ప్రాంతాల్లో మూడు సెంట్లు లబ్దిదారులకు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్, సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్, కాసా రాంబాబు, జిల్లా రైతు సంఘం కార్యదర్శి ఉలవపూడి రాము, భూదాల శ్రీనివాసరావు, ఏఐటీయూసీ కార్యదర్శి ఉప్పలపాటి రంగయ్య, సీపీఐ పట్టణ కార్యదర్శి వైదన వెంకట్ పాల్గొన్నారు.

చంద్రబాబు క్షమాపణ చెప్పాలి : మంత్రి రజిని

విశాలాంధ్ర-చిలకలూరిపేట: తమ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఇళ్ల స్థలాలను సమాధులో పోల్చిన చంద్రబాబునాయుడు తక్షణమే ఈ రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని డిమాండ్ చేశారు. చంద్రబాబునాయుడు అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ చిలకలూరిపేటలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. తొలుత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీ చేపట్టారు. నరసరావుపేట సెంటర్ మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం పెద్ద మనసుతో ఈ రాష్ట్రంలోని పేదలందరికీ ఉచితంగా ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తున్నదని చెప్పారు. దాదాపు 31 లక్షలమందికిపైగా మహిళలకు ఈ స్థలాలను అందజేస్తూ తమ ప్రభుత్వం ఒక చరిత్రను సృష్టించిందని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గ్రామోదయం : కలెక్టర్

విశాలాంధ్ర-ఈపూరు: సమస్యల పరిష్కారానికి గ్రామోదయం కార్యక్రమం ఒక మార్గమని పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ అన్నారు. గ్రామోదయం కార్యక్రమంలో భాగంగా సమస్యలను తెలుసుకునేందుకు శుక్రవారం మండలంలోని కొచ్చర్ల గ్రామంలో కలెక్టర్ శివశంకర్ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రధాన వీధులు కొద్దిపాటి వర్షం పడిన నడిచే పరిస్థితి లేదని గ్రామస్తులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై ప్రజాప్రతినిధులకు అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నప్పటికీ సమస్యను పరిష్కరించలేదన్నారు. అలాగే డ్రైనేజీ వ్యవస్థ కూడా అస్తవ్యస్తంగా ఉండడంతో పాటు మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుందని వినుకొండ నుండి హైదరాబాదు ఆర్ అండ్ బి రోడ్లు కూడా కిలోమీటర్ల మేర ఆక్రమణకు గురైందని దానివలన డ్రైనేజీ లేకుండా పోయిందని దీంతో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుందన్నారు. ఆక్రమణల వలన నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు అవస్థ పడుతున్నామన్నారు. గతంలో రోడ్డుకి ఇరువైపులా ఆక్రమణల వలన వాహనాల ప్రమాదాలు జరిగి మృతిచెందిన సంఘటనలు కూడా ఉన్నాయన్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సమస్యను పరిష్కరించాలని తాసిల్దార్ ఆర్ వెంకటేశ్వర్లు నాయక్ ఎంపీడీవో ఉషాకిరణ్ కు సూచించారు. అలాగే కొచ్చర్ల గ్రామానికి ఆనుకొని రెండు చెరువులు ఉన్న తాగునీటి సమస్యతో అవస్థలు పడుతున్నామని గ్రామంలో 6 వేలకు పైగా సుమారు జనాభా ఉందని ఇప్పటివరకు రక్షిత మంచినీటి పథకం లేదని ప్రైవేటు ఆర్ వో ప్లాంట్ వద్ద తాగునీటిని తెచ్చుకుంటున్నామని ఫ్లోరైడ్ సమస్య కూడా అధికంగా ఉందని కలెక్టర్ ఎదుట తమ గోడును విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, సర్పంచి కోప్పెల దేవరాజ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూనగర్ తండాలో గ్రామోదయం

విశాలాంధ్ర-దుర్గి: గ్రామోదయం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం జిల్లా నవోదయ నోడల్ ఆఫీసర్, మండల స్పెషలాఫీసర్ కె.సంజీవరావు మండల అధికారుల బృందంతో మండల పరిధిలోని నెహ్రూనగర్ తండాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో ఇంటింటికి వెళ్ళి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీ లించారు. పనులు వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్.పద్మాబాయి సుబ్రహ్మణ్యం నాయక్, ఉప సర్పంచ్. రాంజీనాయక్, ఎంపీడీఓ. పి.శివప్రసాద్, ఏఈలు వెలుగొండారెడ్డి, ఇస్తేరురాణి, సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు సమాయత్తం

విశాలాంధ్ర-నూజెండ్ల: రైతులంతా ఖరీఫ్ సాగుకు సమాయత్తం అయ్యే సమయం ఆసన్నమైందని, పంటలు వేసేందుకు భూములు సిద్ధంగా ఉంచుకోవాలని వినుకొండ సహాయ వ్యవసాయ సంచాలకులు బి.రవిబాబు అన్నారు. మండలంలోని వి.అప్పాపురం, జంగాలపల్లె రైతు భరోసా కేంద్రాలలో శుక్రవారం ఖరీఫ్ సాగుకు సమాయత్తం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన నాణ్యమైన ధ్రువీకరించబడిన విత్తనాలు, ఎరువులు ఆర్బికేల ద్వారా పొందాలని సూచించారు. అనంతరం జంగాలపల్లె గ్రామంలో ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమాన్ని పర్యవేక్షించి, సిబ్బందికి పలు సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ జిలాని భాష, ఈవోపీఆర్డి రవికుమార్, ఏఈవో ఏలీషా, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు జిల్లా అడిషనల్ ఎస్పీగా రాఘవేంద్ర

విశాలాంధ్ర-నరసరావుపేట: పల్నాడు జిల్లా అడిషనల్ ఎస్పీగా ఆర్ రాఘవేంద్రను నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హెూం శాఖ కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులను జారీ చేసింది. 2011 ఐపీఎస్ క్యాడర్ కు చెందిన రాఘవేంద్ర రాయలసీమ ప్రాంతంలో సుదీర్ఘకాలం పనిచేశారు. చివరగా కడప జిల్లా ఇంటిలిజెన్సీ డిపార్ట్మెంట్ డీఎస్పీగా విధులు నిర్వహించారు. పోలీస్ శాఖలో శుక్రవారం జరిగిన పదోన్నతులలో భాగంగా రాఘవేంద్రకు పల్నాడు జిల్లా అదనపు ఎస్పీగా నియమించడం జరిగింది. రాఘవేంద్ర స్వగ్రామం అనంతపురం జిల్లా మడకశిర నియోజకవర్గం కురుబురపల్లి.

ఉద్యాన పంటల సాగు వైపు మొగ్గు చూపాలి

విశాలాంధ్ర-దుర్గి: సన్న, చిన్నకారు రైతులు ఉద్యాన పంటల సాగు వైపు మొగ్గు చూపాలని ఎంపీపీ యేచూరి సునీత సాయి శంకర్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పండ్ల తోటల సాగు సబ్సిడీపై ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, వెలుగు సిబ్బందికి ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా నవోదయ నోడల్ ఆఫీసర్ కె.సంజీవరావు మాట్లాడుతూ గ్రామాల్లో పది ఎకరాల లోపు ఉన్న చిన్న, సన్నకారు రైతులను గుర్తించి వారికి ఉద్యాన పంటల సాగు చేయడం వలన కలిగే ఆదాయ ప్రయోజనాలు గురించి అవగాహన కల్పించి, ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గురజాల డివిజన్ డీఎల్ డీవో గబ్రూనాయక్, ఎపీడి సురేంద్ర కుమార్, ఎంపీడీఓ పి.శివప్రసాద్, ఉద్యానశాఖ అధికారి సురేష్, ఎపీఓ చినవెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మిజోరాం గవర్నర్ ఎదుట తెనాలి చిన్నారుల నృత్యం

విశాలాంధ్ర, తెనాలి : తెనాలికి చెందిన గ్రీష్మశ్రీ, తహసీన్‌ల కూచిపూడి నృత్యాన్ని మిజోరాం గవర్నర్ ఎదుట ప్రదర్శించే అవకాశం వచ్చిందని మా ఏపి వ్యవస్థాపకుడు దిలీస్‌రాజా తెలిపారు. స్థానిక సత్యనారాయణ పార్క్‌లో శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ ప్రతిభను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఆదరణలేక శాస్త్రీయ నృత్య కళాకారులు అంతరించిపోతున్నాయన్నారు. మిజోరాం రాష్ట్ర గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబుకు మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు. రాజుల కాలంలో రాజనర్తకిల ప్రదర్శనలను చూసి బహుమతులు ఇచ్చి ప్రోత్సహించే పాలకులు నేడు అరుదుగా వున్నారని వారిలో మిజోరాం గవర్నర్ ఒక్కరని వ్యాఖ్యానించారు. గతంలో కూడా తాను రాష్ట్రపతి, పలువురు గవర్నర్ల ఎదుట తెనాలి బిడ్డల నృత్య ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. తహసీన్ తల్లి ఆలియా మాట్లాడుతూ గవర్నర్ లాంటి ప్రముఖుల ముందు కూచిపూడి నృత్యం చేసే అవకాశం దొరకడం అదృష్టమని ఆనందం వ్యక్తం చేశారు. కపిల సుబ్బారావు, షేక్ రఫి, అమీర్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

వార్డులో నగరోదయం

విశాలాంధ్ర-వినుకొండ: స్థానిక శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు ఆదేశాల మేరకు పట్టణంలో 11వ వార్డు నగరోదయంలో భాగంగా సందర్శించి నాడు , నేడు కార్యక్రమాన్ని మరియు అంగన్వాడి స్కూల్స్ శానిటేషన్ కరెంటు లో వోల్టేజ్ సమస్యలు, నూతనంగా నిర్మించిన డ్రైనేజ్ పనులను మరియు రక్తహీనత గర్భిణీలను పర్యవేక్షించి తగు సూచనలు చేశారు. మున్సిపల్ చైర్మన్ దస్తగిరి షకీలా మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసులు , శానిటేషన్ ఇన్స్పెక్టర్ చెన్నకేశవులు, అంగన్వాడి సిబ్బంది మరియు మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

మంచి నీటి సమస్యపై కమిషనర్‌కు వినతి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: పట్టణంలోని 32 వార్డులో గల భవనా రుషి నగర్ దగ్గర తంత్రి సన్నిధి మినిస్ట్రీ ఎదురుగా ఉన్న మూడు బజార్లో నివాసముంటున్న ఎస్టీలకు గత కొద్ది రోజుల నుంచి పైప్ లైన్లద్వారాగా నీరు రావడం లేదు, ట్యాకర్ల ద్వారా మంచినీరూ సరఫరా చేయడం లేదని శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఏపీ గిరిజన సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావుకు వినతిపత్రం అందజేశారు. ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బి.శ్రీను నాయక్, ఎస్టీ మహిళలు పాల్గొన్నారు.

బాధితుల సొమ్ము నుంచి వాటాలు అడగటం దుర్మార్గం: జీవీ

విశాలాంధ్ర-వినుకొండ: సత్తెనపల్లిలో బాధిత కుటుంబానికి 5 లక్షల రూపాయలు చెక్కు వస్తే దాంట్లో సగం మాకు ఇవ్వాలని మంత్రి అంబటి రాంబాబు అడగటం దౌర్భాగ్యం అని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఘాటుగా విమర్శించారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. సత్తెనపల్లిలో గంగమ్మ కొడుకు లెట్రిన్ క్లీన్ చేస్తూ మృత్యువాత పడ్డ సంఘటనలో గంగమ్మకు ప్రభుత్వ నుండి ఐదు లక్షలు చెక్కు రాగా అందులో సగం మాకిస్తే డబ్బులు ఇస్తామనటం, ఆమె తిరస్కరించడంతో వెనక్కు పంపించేసారని ఇది దుర్మార్గపు చర్య అనే జీవి విమర్శించారు. అలాగే చంద్రబాబు పర్యటనలో భాగంగా కట్టెంపూడిలో దళిత వికలాంగురాలు ట్రై సైకిల్ లేక ఇబ్బంది పడుతుంటే చంద్రబాబు సహాయం చేస్తానని హామీ ఇచ్చినప్పటికీ వైసీపీ వారు బాధితురాలని భయపెట్టి సహాయం తీసుకోవద్దు అని బెదిరించారని జివి అన్నారు. మంత్రి అంబటి రాంబాబు ఇన్ని అఘాయిత్యాలు చేస్తున్న ముఖ్యమంత్రి నోరు మెదపడం లేదని. మంత్రి రాంబాబు చంద్రబాబుపై అవాకులు చవాకులు పేలుతున్నారని జీవి విమర్శించారు. ఇక ముఖ్యమంత్రి ఎన్నికల వాగ్దానాలన్నీ తుంగ లో పెట్టారని మంత్రివర్గంలో అందరూ దోపిడీదారులేనని అన్నారు రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కోతతో ప్రజల అల్లాడుతున్నారని అన్నారు. చంద్రబాబు హయాంలో విద్యుత్ ఉత్పత్తి పెంచి నిరంతరం విద్యుత్ సరఫరా చేశారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ముడుపుల కోసం నాసిరకం విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు కొనుగోలు చేసి విద్యుత్ సమస్య తెస్తున్నారన్నారు. డిజిటల్ మీటర్లు ఏర్పాటు చేసిన కారణంగా బిల్లులు అధికంగా వచ్చి రాష్ట్ర ప్రజలపై 18 వేల కోట్ల అధిక భారం పడిందని జివి అన్నారు. విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు. డిజిటల్ మీటర్లు కొనుగోలుపై ప్రభుత్వం విచారణ జరిపి నిగ్గు తేల్చాలని జీవి ప్రభుత్వాన్ని డిమాండ్. ఈ సమావేశంలో టిడిపి నేతలు గడిపూడి విశ్వనాథం, గుంటూరు సాంబయ్య, వి పేరయ్య, మురళి యాదవ్ పాల్గొన్నారు.

విద్యుత్ వ్యవస్థను భ్రష్టు పట్టించిన జగన్ సర్కార్ : ప్రత్తిపాటి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: 2019 ఎన్నికల నాటికీ మిగులు విద్యుత్‌తో ఉన్న రాష్ట్రాన్ని చంద్రబాబు నాయుడు, జగన్మోహన్ రెడ్డికి అప్పగిస్తే, ఈ 4 ఏళ్లలో విద్యుత్ వ్యవస్థను జగన్ సర్కారు సర్వనాశనం చేసి భ్రష్టు పట్టించారని మాజీ మంత్రి ప్రత్తిపాటి ఆరోపించారు. శుక్రవారం ఆయన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఒక వైపు తీవ్రమైన ఉష్ణోగ్రతలతో ప్రజలు అల్లాడిపోతుంటే, మరోవైపు విద్యుత్ కోతలతో జగన్ సర్కారు ప్రజలను మరింత అల్లాడిస్తున్నారని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఐదు సంవత్సరాలు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ ను 24 గంటలు సరఫరా చేయడమే కాకుండా, ప్రభుత్వం అధికారం నుండి దిగిపోయే నాటికీ 10వేల మెగావాట్ల మిగులు విద్యుత్ ను వైసీపీ ప్రభుత్వానికి అందించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ విద్యుత్ సంస్థల్లో వాటి సామర్థ్యం మేరకు విద్యుత్ ఉత్పత్తి జరగకుండా చేస్తూ, మరోవైపు ప్రైవేట్ సంస్థల వద్ద అధిక ధరకు విద్యుత్ ను కొనుగోలు చేస్తూ, ముఖ్యమంత్రి వేల కోట్లు కమిషన్ రూపంలో దోచుకుంటున్నాడని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన ఈ నాలుగేళ్లలో ఏడుసార్లు విద్యుత్ ఛార్జీలను పెంచిన ఘనత ఒక్క జగన్ సర్కారుకే సాధ్యపడిందన్నారు. ఇప్పటికైనా జగన్ సర్కార్ కళ్ళు తెరిచి విద్యుత్ వ్యవస్థను బాగు చేయాలని, కోతలు లేని కరెంటు ఇవ్వాలని, పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

దివ్యాంగురాలికి అంబటి సాయం

విశాలాంధ్ర-సత్తెనపల్లి : మండల పరిధిలోని కంటెపూడి గ్రామానికి చెందిన దివ్యాంగురాలు నాగలక్ష్మికి రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ట్రై సైకిల్ అందించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో నాగలక్ష్మి ఇంటి వద్దనే వాహనం అందించి మంత్రి మాట్లాడుతూ గత నెల 27వ తేదీన మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు సత్తెనపల్లి నుంచి మేడికొండూరు మండలం కార్యక్రమానికి వెళుతూ మార్గమధ్యలో రోడ్డుపక్క నిలిచిన ఈ గ్రామ ఎస్సీ కాలనీవాసులను గమనించి వాహనం దిగి వారిని పలకరించారు. ఈ సంఘటనలో నాగలక్ష్మితో బాబు మాట్లాడారన్నారు. మా కుటుంబాలలో నాకు, నా తల్లికి పింఛన్ వస్తుందని నాగలక్ష్మి బాబుకు వివరించినా... నీకు లక్ష నగదు, ట్రై సైకిల్ పంపిణీ చేస్తానని బాబు హామీ ఇచ్చి వెళ్లడం జరిగిందని మంత్రి అంబటి గుర్తుచేశారు. బాబు హామీ ఇచ్చి 24 రోజులు గడిచినా సాయం చేయకపోవడంపైగా టీడీపీ కార్యాలయానికి వస్తేనే సైకిల్ పంపిణీ చేస్తామని దివ్యాంగురాలిని ఒత్తిడి చేయడం బాధాకరమన్నారు. అందుకే స్పందించి ట్రై సైకిల్ పంపిణీ చేస్తున్నామన్నారు. నాగలక్ష్మి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఇంటి స్థలం ఇప్పించాలని కోరగా ఈ కాలనీలో అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇప్పించామని, మీకు అర్హత ఉంటే తప్పకుండా వస్తుందని, అవకాశాన్ని పరిశీలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చుక్కల భూములకు శాశ్వత పరిష్కారం

విశాలాంధ్ర-వినుకొండ: పట్టణంలోని బొల్లా బ్రహ్మ నాయుడు కళ్యాణ మండపంలో చుక్కల భూముల చిక్కులకు శాశ్వత పరిష్కారం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం స్థానిక శాసనసభ్యుడు బొల్లా బ్రహ్మనాయుడు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, జిల్లా జాయింట్ కలెక్టర్ శాంప్రసాద్ , ఆర్డిఓ శేషి రెడ్డి పాల్గొన్నారు.. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా 2,06,171ఎకరాల చుక్కల భూములకు ఊరట లభించిందని, అందులోనూ పల్నాడు జిల్లాలో సుమారు 30,171 ఎకరాలు చుక్కల భూమి కి పరిష్కారం లభించిందని తెలిపారు. పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివ శంకర్ మాట్లాడుతూ చుక్కలు భూములు సాగుచేసుకుం టున్న రైతులందరికీ హక్కు కలిపిస్తున్నమని అలాగే అగ్రహార భూములు సాగుచేసుకుంటున్న రైతులకు కూడా పరిష్కారం చూపిస్తున్నమని ఆయన అన్నారు. వినుకొండ నియోజకవర్గం లోని 5మండలంలోని 9000 ఎకరాలకు లబ్ది చేకూరిందని అలాగే అగ్రహారం భూములు కూడా తొందరలోనే ప్రభుత్వం నుండి పరిష్కారం లభిస్తుందని తెలిపారు.. ఈ కార్యక్రమంలో నియోజకవర్గలోని అన్ని మండలాల అధికారులతో పాటు గా నియోజకవర్గ లో లబ్ధి పొందిన రైతులు పాల్గొన్నారు.

ఆక్రమణతో నిండిన సాగర్ రింగ్ రోడ్డు

విశాలాంధ్ర-మాచర్ల: పట్టణంలో రోడ్డు ఆక్రమణలు అధికమయ్యాయి. ఒకవైపు ట్రాఫిక్, మరో వైపు రోడ్డు ఆక్రమణలతో పట్టణవాసులు సతమతమవుతున్నారు. పట్టణంలోని నెహ్రూ నగర్, సాయి కృష్ణ హెూటల్ సెంటర్, వెంకటేశ్వర థియేటర్, రింగ్ రోడ్డు ఆంధ్ర బ్యాంకు వరకు నిర్దేశించిన మార్జిన్ నుండి 20 అడుగుల వరకు షాపు యజమానులు రోడ్డును ఆక్రమించుకోవడంతో రోడ్డు వెడల్పు తగ్గి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో ఏ క్షణాన ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు భయపడుతున్నారు. రోజు రోజుకి పెరుగుతున్న జనాభాకనుగుణంగా రోడ్డు విస్తరణా పనులు చేపట్టాల్సిన అధికారులు ఆ దిశలో కనబడటం లేదు. ఆక్రమణలతో రోడ్ల విస్తీర్ణం తగ్గి తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారంటూ ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పట్టణంలోని ప్రధాన కూడళ్లల్లో పార్కింగ్ స్థలాన్ని చూపించకుండా భారీ కట్టడాలకు సంబంధిత అధికారులు అనుమతులు ఎలా ఇస్తున్నారో సమాధానం చెప్పాలంటూ పట్టణవాసులు ప్రశ్నిస్తున్నారు. ప్రజల ప్రాణాల కన్నా, ఆక్రమణదారులు కట్టే పన్నులే ముఖ్యంగా భావించే అధికారుల ధోరణి మార్చుకొని, ఆక్రమణదారులపై వెంటనే చర్యలు చేపట్టాలని పలువు కోరుతున్నారు.

చంద్రబాబును ప్రజలు క్షమించరు

విశాలాంధ్ర-పెదకూరపాడు : రాజధాని ప్రాంతంలో సుమారు 50 వేల మందికి సెంటు భూమి చొప్పున ఇళ్ల స్థలాలు అందించేందుకు సిద్ధమైన వైసీపీ ప్రభుత్వంపై ప్రతిపక్ష నేత చంద్రబాబు అవమానకర వ్యాఖ్యలు చేయడంపై మండల వైసీపీ నాయకులు బస్టాండ్ సెంటర్ నుంచి ఆనందపేట వైఎస్సార్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, మండల వైసీపీ కన్వీనర్ షరీఫ్‌లు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ నాయకులు కంచర అచ్యుతారావు, వైస్ ఎంపీపీ భాష, జడ్పీటీసీ కంకణాల స్వర్ణ కుమారి శివాజీ, చిన్న మక్కెన, సర్పంచ్ బాజీ, మండల సచివాలయాల కన్వీనర్ మాగులూరి అనీల్ కుమార్, బచ్చు హనుమంతరావు, నల్లపాటి యోహాన్, బత్తుల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనపై సమీక్ష

విశాలాంధ్ర-తాడేపల్లి: సిఆర్డిఏ పరిధిలో పేదలకు ఇస్తున్న ఇళ్లపట్టాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్య అతిధిగా విచ్చేయనున్నారు. ఆయన పర్యటనను పురస్కరించుకుని శుక్రవారం ఎంటిఎంసి పరిధిలోని తాడేపల్లి కార్పోరేషన్ కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి పర్యటన పరిశీలకులు ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, పార్లమెంట్ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల రెడ్డి, ఎన్టిఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరాజు, గుంటూరు జిల్లా యస్పి ఆరిఫ్ హఫీజ్ తో కలసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ రాజ్యలక్ష్మి, సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, గుంటూరుజిల్లా అడిషనల్ యస్పి అనిల్, ఎంటిఎంసి కమిషనర్ శారదాదేవి, తాడేపల్లి తహశీల్దార్ మర్రిరెడ్డి నాగిరెడ్డి, మంగళగిరి తహశీల్దార్ రామ్ ప్రసాద్, మంగళగిరి నార్త్ జోన్ డియస్పి రాంబాబు, ప్లానింగ్ అధికారులు ఎంటిఎంసి డి.ఇ. కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లంక, అసైన్డ్ భూములకు ప్యాకేజీ, కౌలు చెల్లిస్తారా లేదా

విశాలాంధ్ర-తుళ్ళూరు : అసైన్డ్ భూములు, లంక భూములకు కౌలు తొందరగా ఇవ్వాలని, అసైన్డ్ భూములు లంక భూములకు ముఖ్యమంత్రి గతంలో ఇచ్చిన హామీకి అనుగుణంగా పెంచిన ప్యాకేజీని ఇవ్వాలని స్థానిక వైసీపీ నాయకులు వారి ప్రభుత్వ పెద్దల దగ్గర ఒత్తిడి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అమరావతి నగర అధ్యక్షుడు కొమ్మినేని సురేష్ బాబు, ఏపీ సీసీ ప్రధాన కార్యదర్శి చిలకా విజయ్ కుమార్, తుళ్లూరు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అడుసుమల్లి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి వెలగలేటి కోటేసు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

విశాలాంధ్ర-పెదకాకాని : మండల కేంద్రమైన పెదకాకానిలో ఆదివారం నందమూరి తారకరామారావు విగ్రహావిష్కరణ జరుగునని మాజీ ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరపు అచ్చం నాయుడు ప్రారంభోత్సవం చేస్తారని పెదకాకాని మండల అధ్యక్షులు వలివేటి మురళీకృష్ణ తెలిపారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు మాట్లాడుతూ ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ సందర్భంగా నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరులు, ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామ్మోహన్‌రావు, దర్శి భాస్కరరావు, దర్శి వెంకటేశ్వరరావు, బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఆరుగురు అరెస్ట్

విశాలాంధ్ర-ఫిరంగిపురం : మండల పరిధిలోని వేములూరుపాడు గ్రామంలో హైవే రోడ్డు పక్కన గల పాత రైసుమిల్లు వద్ద ఆరుగురు వ్యక్తులు డబ్బులు పందెంగా పెట్టి పేకాట జూదం ఆడుతుండగా ఫిరంగిపురం పోలీసులు శుక్రవారం దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.10,250లను సీజ్ చేశారు.

CHANGE OF NAME

I, **KOLLIPARA GOPALA LAKSHMI SAILAJA PAVANI** (Old Name) W/o. KOLLIPARA VEERA BRAHMA BHASKAR, R/o. D.No.11-13-60/1, Flat No.102, Vennela Heights, Ramireddy Pet, Narasaraopet, Palnadu District - 522601, Andhra Pradesh, have changed my name to **KOLLIPARA PAVANI.** Hereafter my name is known as **KOLLIPARA PAVANI.**

రోటరీ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు

విశాలాంధ్ర-అద్దంకి : రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర నేత్రాలయం కాకాని ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక అంబేద్కర్ భవనం నందు అద్దంకి వెంకయ్య జ్ఞాపకార్థం జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరంలో వైద్యులు 250 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరికి కంటి శుక్లంల ఆపరేషన్ల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసి కాకాని శంకరా నేత్రాలయానికి పంపించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎల్,ఎస్తేరమ్మ, రోటరీ అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసరావు, కార్యదర్శి చిన్ని మురళీకృష్ణ శంకరా నేత్రాలయం వైద్యులు పాల్గొన్నారు.

మేరా లైఫ్-మేరా స్వచ్ఛ నగర్ ర్యాలీ

విశాలాంధ్ర-అద్దంకి ; ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం సూచనల మేరకు అద్దంకి పురపాలక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మేరా లైఫ్-మేరా స్వచ్ఛ భారత్ నినాదంతో మున్సిపల్ ఉద్యోగులు, శానిటేషన్ సిబ్బంది, సచివాలయాల సిబ్బంది పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని మున్సిపల్ కమీషనర్ టి,రవికుమార్ ప్రారంభించారు.

12వ రోజుకు వేసవి విజ్ఞాన తరగతులు

విశాలాంధ్ర-అద్దంకి ; శాఖా గ్రంధాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతులు శుక్రవారం 12వ రోజుకు చేరాయి. శుక్రవారం సాయి పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజు,సృజన అధ్యక్షులు దివాకరదత్తులు స్పోకెన్ ఇంగ్లీష్, తెలుగు కథల గురించి విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. లెక్కల క్విజ్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు క్రికెట్ బాల్స్, బ్యాట్, తెలుగు గ్రామర్ పుస్తకాలను బహుమతులుగా అందజేశారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు సుగుణరావు పాల్గొన్నారు.

వాహనాలకు అనుమతి పత్రాలు తప్పనిసరి

విశాలాంధ్ర - సంతమాగులూరు : ప్రతిఒక్కరూ తమ వాహనాలకు అనుమతి పత్రాలు, వ్యక్తిగత లైసెన్సులు అందుబాటులో ఉంచుకోవాలని సంతమాగులూరు పీఎస్ ఎం.వి.శివకుమార్ సూచించారు. శుక్రవారం ఏల్చూరు టోల్ ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. బైకులపై ప్రయాణిస్తున్న వారు విధిగా హెల్మెట్ ధరించాలని చెప్పారు. ప్రమాదాల నివారణకు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎవరైనా రవాణా నిబంధనలు బేఖాతరు చేస్తూ.. వాహనాలు నడిపితే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

వేసవి విజ్ఞాన శిబిరంతో పిల్లలకు మేలు

విశాలాంధ్ర - సంతమాగులూరు : గ్రంథాలయాలలో తలపెట్టిన వేసవి విజ్ఞాన శిబిరం పిల్లలకు జ్ఞానం పెంపొందించేందుకు ఉపయుక్తంగా పనిచేస్తున్నాయని గ్రంథపాలకుడు బాదం విజయభాస్కర్ రెడ్డి అన్నారు. సంతమాగులూరు శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు 12వ రోజు శుక్రవారం నిర్వహించారు. గ్రంథపాలకుడు అధ్యక్షతన బాలబాలికలకు కావాల్సిన పుస్తకాలు, వివిధ రకాల ఆట వస్తువులు అందుబాటులో ఉంచారు. చదవడం మాకు ఇష్టం కార్యక్రమంలో భాగంగా 30 మంది విద్యార్థులు లైబ్రరీలోని జనరల్ నాలెడ్జ్, చందమామ కథలు, ఆధ్యాత్మిక విషయాలకు సంబంధించిన పుస్తకాలను పఠనం చేశారు. ఈ వేసవి శిక్షణ శిబిరంలో లైబ్రరీకి పిల్లలను తప్పనిసరిగా పంపించాలని తల్లిదండ్రులను ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి...

విశాలాంధ్ర - పిట్టలవాని పాలెం : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ఇరువురికి తీవ్ర గాయాలు అయిన సంఘటన మండలంలోని చందోలు హైవే వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. చందోలు ఎస్ఐ రాజశేఖర్ కథనం ప్రకారం చెరుకుపల్లి మండలం తుమ్మలపాలెం గ్రామానికి చెందిన పగడం ఇంద్ర కిరణ్ రెడ్డి (22) అనే యువకుడి ద్విచక్ర వాహనంపై ముగ్గురు యువకులు శుక్రవారం చీరాల నుండి తుమ్మలపాలెం గ్రామానికి వస్తున్న క్రమంలో చందోలు హైవే పై అతివేగంతో వస్తు ద్విచక్ర వాహనం అదుపుతప్పి హైవే సమీపంలోని కొత్త బస్సు షెల్టర్ గోడను ఢీ కొట్టడంతో ద్విచక్ర వాహనం నడుపుతున్న కిరణ్ అనే యువకుడి తలకి తీవ్ర గాయం అవ్వడంతో అక్కడిక్కడే మృతి చెందాడు.తీవ్ర గాయాలతో ఉన్న మిగితా ఇద్దరినీ ఆసుపత్రికి తరలించామన్నారు.కిరణ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు.జరిగిన సంఘటన పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వాలంటీర్లు సేవాస్ఫూర్తితో పనిచేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర - బాపట్ల : గ్రామ, వార్డు వాలంటీర్లు సేవా స్ఫూర్తితో పని చేయాలని, ప్రతి ప్రభుత్వ పథకాన్ని ప్రజ లకు చేరవేయాలని కలెక్టరు పి.రంజితబాషా అన్నారు. వాలంటీర్ల అవార్డుల ప్రదానోత్సవం శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో జరిగింది. ఎన్.టి.ఆర్ జిల్లా విజయవాడలో నిర్వహించిన కార్యక్ర మానికి ముఖ్యమంత్రి వై.యస్.జగన్ మోహన్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమాన్ని జిల్లాలో తిలకించేలా ప్రత్యక్ష ప్రసారానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. లంచాలు, అవినీతి లేకుండా ప్రభుత్వ పథకాలను నేరుగా పేదల ఇంటివద్దకు తీసుకువెళ్లేలా బ్రాండ్ అంబాసిడర్లుగా వాలంటీర్లు నిలిచారన్నారు. వాలంటీర్ల సేవలను రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు. వాలంటీర్ల అభినందన కార్యక్రమాలు అన్ని జిల్లాలోని నియోజకవ ర్గాలలో 10 రోజులపాటు నిర్వహించాలని ఆయన సూచించారు. అనంతరం జిల్లాలోని 25 మంది వాలం టీర్లకు సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర పురస్కారాలను కలెక్టరు రంజిత్ బాషా, శాసనమండలి సభ్యులు పోతుల సునీత, శాసనసభ సభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి చేతులమీదుగా అందించారు. ప్రజలందరికి వాలంటీర్లు మంచి సేవలు అందించాలని కలెక్టరు తెలిపారు. కోవిడ్ సమయంలో వాలంటీర్లు అందించిన సేవలు ప్రపంచ వ్యాప్తంగా మరింత ప్రాచుర్యం పొందాయన్నారు. ప్రతి ప్రభుత్వ పథకాన్ని అర్హులైన పేదలందరికి చేరవేయాల న్నారు. మంచి సేవలు అందించిన వాలంటీర్లకు సేవా రత్న, సేవావజ్ర పురస్కారాలతో సన్మానించడం అభినంద నీయమన్నారు. ఉన్నతమైన ప్రమాణాలు పాటిస్తూ సేవల్లో మంచి పేరు సంపాదించుకోవాలన్నారు. జిల్లాలో 7,511 మందికి సేవామిత్ర పురస్కారాలతో పాటు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున రూ.7.51కోట్లు నగదును బహు మతిగా ఇస్తున్నట్లు తెలిపారు. 145 మందికి సేవారత్న పురస్కారాలు, రూ.20 వేలు చొప్పున మొత్తం రూ.29 లక్షలు అందిస్తామన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా 30 మందికి సేవావజ్ర పురస్కారాలతోపాటు రూ.30వేలు చొప్పున రూ.9లక్షల నగదును ఇస్తున్నామని చెప్పారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 7,686 మందికి పురస్కారాలు లభించాయన్నారు. గాంధీజి కలలు కన్న గ్రామస్వరాజ్యం నేడు అమలులోకి వచ్చిందని శాసనమండలి సభ్యురాలు పోతుల సునీత తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను మారుమూల గ్రామాలలోని నిరుపేదలకు సైతం అందిం చడానికి వాలంటీర్ల వ్యవస్థను ముఖ్యమంత్రి ప్రవేశ పెట్టారన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు సారథులుగా మంచి సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు. ఆరోగ్యశ్రీ, నవరత్నాల పథకాలు ప్రజలకు చేరువయ్యేలా వాలంటీర్లు చేస్తున్న సేవా కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. వాలంటీర్ల వ్యవస్థ రాష్ట్ర ముఖ్యమంత్రి మానసపుత్రికగా అభివర్ణించారు. ప్రజలందరికి సంక్షేమ ఫలాలు అందించే బాధ్యతను వాలంటీర్లు అదృష్టంగా భావించాలన్నారు. ముఖ్యంగా కోవిడ్ సమయంలో వాలంటీర్లు చేసిన సేవలు ఎన్నటికీ మరువలేనివన్నారు. వాలంటీర్లకు ఏదైన సమస్యలు వస్తే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. వాలంటీర్లకు అండగా ఉంటామని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చీరాల శాసనసభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి, జిల్లా సంయుక్త కలెక్టరు సిహెచ్.శ్రీధర్, సి.పి.ఓ జి.భరత్, వివిధ శాఖల అధికారులు, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

పేదలను అవమానించేలా బాబు వ్యాఖ్యలు: మోపిదేవి

విశాలాంధ్ర-రేపల్లె : ప్రభుత్వం నిరుపేదలకు ఇస్తున్న సెంటు భూములు సమాధులు కట్టుకోవటా నికి కూడా సరిపోవని ప్రతిపక్ష పార్టీ నాయకుడు చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించటం పేదలను అవమానించటమేనని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ రావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాల యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సహకరించక పోయిన అర్హత ఉన్న ప్రతి పేదవానికి కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించాలనే ఆశయంతో పని చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పై తప్పుడు ప్రచారం చేస్తూ టిడిపి నాయకులు తమ ఉనికిని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సెంటు భూమి కూడా లేని నిరుపేదలు ఎందరో కాల్వ గట్టులపైన, రోడ్డు మర్జిన్లలో నివాసం ఉంటున్నరని అన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పేదలకు సెంటు భూమి కూడా ఇవ్వలేని వారు మాట్లా డటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని విమర్శిం చారు. చంద్రబాబు నాయుడు అతని అనుచరులు అమరావతి రాజధాని నిర్మాణం పేరుతో రైతులవద్ద నుండి వేల ఎకరాలు సేకరించి, రియల్ ఎస్టేట్ వ్యాపా రం చేశారని ఆరోపించారు. సింగపూర్ కంపెనీలకు వేలాది ఎకరాల భూమిని కట్టబెట్టి కోట్లు గడించాలని చూశారని ఆరోపించారు. విజయవాడ అర్బన్ పరిధిలోని పేదలకు నివేశన స్థలాలు ఇవ్వాలంటే అక్కడ భూమి లభ్యత తక్కువగా ఉండదని, మంగళగిరిలో భూముల రేట్లు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో అమరావతి ప్రాంతంలో ఉన్న దాదాపు 15 ఎకరాల ప్రభుత్వ భూమిలో 51,396 మందికి పట్టాలు మంజూరు చేస్తుంటే, కోర్టులను ఆశ్రయించి స్టే తీసుకువచ్చి అడ్డుకోవాని చూడటం చంద్రబాబు ఫ్యూడల్ విధానాలకు నిదర్శనం అన్నారు. పేదలకు న్యాయం చేయాలని చూస్తుంటే ప్రతి పథకానికి అవినీతిని అంటకట్టటం టిడిపి నాయకులకు అలవాటుగా మారిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. వారు అధికారంలో ఉన్నప్పుడు చేతి వృత్తి దారులకు ఇచ్చిన పనిముట్లలో తీవ్ర అవినీతి జరిగిందన్నారు. ఆదరణ పథకం పేరుతో పేదల వద్ద వేలాది రూపాయలు వసూలు చేశారని ఆరోపించారు. చంద్రబాబు నాయుడు, అతని తనయుడు లోకేష్ ఎన్ని పాదయాత్రలు చేసిన ఉపయోగం లేదన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం విజయం సాధిస్తుందని అన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గడ్డం రాధాకృష్ణ మూర్తి, చైర్ పర్సన్ కట్టా మంగ, వైస్ చైర్మన్ తునుగుంట్ల కాశీ విశ్వనాథ గుప్త తదితరులు పాల్గొన్నారు.

కాలువల అభివృద్ధి పనులకు సిద్ధం చేయాలి

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లాలో సాగునీటి, మురుగునీటి కాలువల అభివృద్ధి పనులు జూన్ 10లోగా పూర్తి చేయడానికి ప్రణాళికలు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని స్పందన హాల్ లో జిల్లా స్థాయి వ్యవసాయసలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సాగుకు నీరు విడుదల చేసే సమయంలో కాలువ పనులు పూర్తి చేయడానికి పక్కా ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని ఇరిగేషన్ అధికారులకు చెప్పారు.జిల్లాలో అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటల నమోదు పూర్తి చేసి ప్రభుత్వాని నివేదికను పంపాలన్నారు. జిల్లాలో ఇ.కె.వై .సి 16 శాతం పెండింగ్ ఉందని వెంటనే నూరుశాతం పూర్తి చేయాలని చెప్పారు.జిల్లాలో నాబార్డ్ బ్యాంక్ ద్వారా అందించే వ్యవసాయ రుణాలను వినియోగించుకోవాలన్నారు. అనంతరం రైతులకు భూసారానికి ఉపయోగించే నవ ధాన్యాలను కలెక్టర్ పంపిణీ చేశారు. మత్స్య శాఖకు సంబంధించిన మొబైల్ ఆక్వా ల్యాబ్ ను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దశరథ మహా రాజు, జాయింట్ కలెక్టర్ సి.హె.శ్రీధర్,వ్యవసాయ శాఖ జె.డి అబ్దుల్ సత్తార్,పశుసంవర్ధక శాఖ జె.డి హనుమంతరావు , మత్స్య శాఖ జె.డి సురేష్, ఉద్యాన వన శాఖ ఏ.డి జెనెమ్మ, రైతులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రల అదనపు భారం ప్రభుత్వం భరించటం హర్షణీయం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : హజ్ యాత్రలకు అదనపు భారం పడకుండా రాష్ట్ర ప్రభుత్వమే భరించటం హర్షణీయమని గుంటూరు జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ ప్రెసిడెంట్ స్టార్ మస్తాన్, జాయింట్ సెక్రటరీ షేక్ సుభాని అన్నారు. ఈ మేరకు శుక్రవారం గుంటూరు మస్తాన్ దర్గాలో స్టార్ మస్తాన్, షేక్ సుభానిల ఆధ్వర్యంలో సీఎం వైఎస్ జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ముస్లిం పవిత్ర హజ్ యాత్ర చేయడం లక్ష్యంగా భావిస్తారని, అలాంటి హజ్ యాత్ర చేసే ప్రతి ముస్లింలు రూ.80వేలు భారాన్ని తగ్గించి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల మరోసారి ముస్లింల పక్షపాతిగా జగన్‌ను అభివర్ణించారు. దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ అమలు చేసి ముస్లిం మనసులో చిరస్థాయిగా నిలిచారని, అదేవిధంగా తనయుడు జగన్మోహన్ రెడ్డి దేశంలో ఎక్కడా లేనిటువంటి ముస్లింల కోసం అనేక పథకా లను అమలు చేసి వారు ఆర్థికంగా ఎదిగేందుకు దోహదపడుతున్నారని కొనియాడారు. మస్తాన్ దర్గా ధర్మకర్త రావి వెంకటరావు, వక్ఫ్‌బోర్డు సభ్యులు సయ్యద్ సుభాని, మున్నా, ఉమర్ అలీ, మార్కెట్ ఖాసీం, షేక్ అబ్దుల్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

హైందవ ధర్మ శంఖారావం సభ జయప్రదం చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ఈ నెల 21వ తేదీన స్థానిక శ్రీవాసవీ హోల్‌సేల్ క్లాత్ మార్కెట్ ప్రక్కన ఉన్న స్థలము నందు హిందూ ధర్మ దీక్షా సేవక్ జిల్లా ఆధ్వర్యంలో పీఠాధిపతులు, స్వామిజీలు, రాష్ట్ర స్థాయి వివిధ ధార్మిక సంస్థల ప్రతినిదులతో నిర్వహించే హైందవ ధర్మ శంఖారావం సభకు హిందువులు వేలాదిగా పాల్గొని సమ్మేళనాన్ని విజయవంతం చేయవలసినదిగా శ్రీ శైవక్షేత్ర పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ శివ స్వామి పిలుపుని చ్చారు. శుక్రవారం ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ హిందువులను చైతన్య పరచి హిందూత్వం యొక్క విశిష్ఠతను తెలిపి సంఘటితంగా మనధర్మాన్ని, సంస్కృతిని కాపాడుకోవలసిన సందేశాన్ని అందిస్తున్నామని అన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా కార్య నిర్వాహక అధ్యక్షులు ఇక్కుర్తి సదాశివరావు, కాపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కరెంటు కోతల నుంచి ప్రజలను రక్షించండి

విశాలాంధ్ర-చీరాల: జగన్ రెడ్డి లూటీ, అవినీతి కార ణంగా విద్యుత్ వినియో గంపై 57 వేల కోట్ల భారాలు ప్రజలపై జగన్మో హన్ రెడ్డి మోపాడని, జగన్ బినామీ ప్రైవేట్ విద్యుత్ సంస్థల వద్ద కమిషన్లకు అధిక రేట్లకు విద్యుత్ కొనుగోలు చేసి, కమిషన్ల కోసం కృత్రిమ కొరత సృష్టిస్తూ ప్రజలను విద్యుత్ చార్జీలతో వేధిస్తున్నారని,విద్యుత్ చార్జీల నుంచి ప్రజలను రక్షించాలని చీరాల తెలుగుదేశం నాయకులు అన్నారు. చీరాల తెలుగుదేశం కార్యాలయంలో ఇంచార్జి కొండయ్య ఆదేశాల మేరకు విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాట్లాడుతూ అవినాష్ రెడ్డి బినామీ కంపెనీ షిరిడి సాయి ఎలక్ట్రికల్స్ వద్ద 60,000 ట్రాన్స్ఫారంకు లక్ష 30 వేలకు ఎందుకు కొంటున్నారని అన్నారు. స్మార్ట్ మీటర్లు 18,000 విలువగల దాన్ని 30 వేలకు కొనుగోలు చేస్తూ ఖర్చు చేయబోయే 30 వేల కోట్లలో 12 వేల కోట్లు కమిషన్ కొట్టేస్తున్నారని అన్నారు. ఈ అధిక భారాలు విద్యుత్ వినియోగదారులపై వేస్తు,టారిఫ్ ల కుదింపు, స్లాబుల మార్పు,ఫిక్స్డ్‌చార్జీలు అదనపు డిపాజిట్లు రూపంలో ఏడుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారని,ప్రజలపై పడిన భారం 17,093 కోట్లని అన్నారు. చంద్రబాబు హయాంలో విద్యుత్ ఇతర రాష్ట్రాలకు అమ్మే స్థాయిలో ఆంధ్రప్రదేశ్ ఎదిగిందని,నాడు కరెంటు కోతలు లేవని విద్యుత్ చార్జీల ధరల పెంచలేదని అన్నారు. జగన్ రెడ్డి ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో ఒక్క యూనిట్ అదనపు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం పెంచింది లేదని,కరెంటు కోతలు బాగా పెరిగాయని, పరిశ్రమలకు పవర్ హాలిడేస్ ప్రకటించారని,సేవలు నామమాత్రమైనప్పుడు చార్జీలు భారీగా పెంచడం ఎందుకని అన్నారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో లోటును అధిగమించి కోతలు లేని 24 గంటలు నాణ్యమైన విద్యుత్ అందించిన ఏకైక ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడని అన్నారు. ఈ కార్యక్రమంలో గజవల్లి శ్రీనివాసరావు, గంజి పురుషోత్తం,కౌతవరపు జనార్దన్, దుడ్డు శామ్యూల్, కూరపాటి పూర్ణ,లావేటి శ్రీనివాసతేజ,అంగిరేకుల వెంకటేశ్వరరావు, వడ్లమూడి వెంకటేష్,బోయిన శివరామకృష్ణ, గుంటి మల్లికార్జున,లక్కాకుల రామారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణ పనులు వేగంగా చేపట్టాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: నగరంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా రోడ్ల విస్తరణ పనులు వేగంగా చేపట్టాలని, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో పనులు చేపట్టాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో పట్టణ ప్రణాలిక, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విస్తరణ జరిగిన ప్రాంతాల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు మంజూరు చేయాల్సిన టిడిఆర్ బాండ్లు ఇంకా కొన్ని ప్రాంతాల్లో ఇవ్వలేదని, వాటిని వెంటనే ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఏటి అగ్రహారం పనులు వేగంగా జరగాలని, విస్తరణ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ఇతర శాఖలతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. బకాయిలు చెల్లించకుండా మీడియా సంస్థలు బోర్డ్ ల మీద యాడ్స్ పబ్లిష్ చేసుకుంటున్నారని, వచ్చే వారం రోజుల్లో డిస్ప్లే ఫీజులు రూ.1 కోటి వసూళ్లు లక్ష్యంగా యాక్షన్ ప్లాన్ చేపట్టాలని, బకాయిలు చెల్లించని బోర్డ్ లను వెంటనే తొలగించాలని సిటి ప్లానర్ కు స్పష్టం చేశారు. సమావేశంలో సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, డిప్యూటీ సిటి ప్లానర్లు మూర్తి, కోటయ్య, ఏసిపిలు బాబురావు, అజయ్ కుమార్, అశోక్ కుమార్, డిఈఈ రమేష్ బాబు, టిపిఎస్ లు, ఏఈ పాల్గొన్నారు.

విశాలాంధ్ర బాపట్ల జిల్లా

చలో బాపట్ల సభ జయప్రదానికి పిలుపు

విశాలాంధ్ర - సంతమాగులూరు: బాపట్ల జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు అద్దంకి నాగేశ్వరరావు తెలిపారు. ఈనెల 21న మధ్యాహ్నం 3 గంటలకు బాపట్లలోని పాత బస్టాండు వద్ద ఉన్న పూర్ణ ఫంక్షన్ హాలులో ఆహ్వానం సంఘం సమా వేశం జరుగుతుందని చెప్పారు. ఈసందర్భంగా శుక్రవారం కొమ్మాలపాడులో కరపత్రాలు ఆవిష్కరణ నిర్వహించారు. అతిథిగా సీపీఐ బాపట్ల జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ హాజరయ్యారు. ముందుగా సీపీఐ సంతమాగులూరు మండల సహాయ కార్యదర్శి కాలేషాగారి ఖాదర్ బాషాతో కలిసి సింగరకొండ కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శ్రామిక వర్గాల హక్కులు కోసం పోరాటం చేసిన ఎంతోమంది త్యాగమూర్తుల కాలుమోపిన గడ్డ బాపట్లలో వ్యవసాయ కార్మిక సంఘం మహాసభలు ఏర్పాటుకు శ్రీకారం చుట్టడం సంతోషంగా ఉందని చెప్పారు. ఈ సమావేశంలో ఆ సంఘం ఏపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కామ్రేడ్ జల్లి విల్సన్, ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఆవుల శేఖర్, భారత కమ్యూనిస్టు పార్టీ బాపట్ల జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ ముఖ్య అతిథులుగా హాజరు అవుతారని పేర్కొన్నారు. ఈ సభకు మండలంలోని సీపీఐ మరియు కార్మిక సంఘాల నేతలు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

సెక్రటరీ గైర్హాజరుపై ఈవోపీఆర్డీ ఆగ్రహం

విశాలాంధ్ర - సంతమాగులూరు: కుందుర్రు పంచాయతీలో స్పందన రీటపెన్ జేకేసీ అర్జీలపై సంతమాగులూరు ఈవోపీఆర్డీ ఆర్వీఎస్ ప్రసాద రావు శుక్రవారం విచారణ చేపట్టారు. ఈ సమయంలో పంచాయతీ కార్యదర్శి జె.ఆనంద్ కుమార్ విధులకు గైర్హాజరు కావడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు సెక్రటరీపై చర్యలు నిమిత్తం జిల్లా గ్రామ పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. అనంతరం శానిటేషన్ మరియు వీధి దీపాలు వెలగడం లేదని 3వ వార్డు సభ్యుడు అడవి చిన్న శ్రీను స్పందనలో ఫిర్యాదు చేశారు. దీనిపై ఈవోపీఆర్డీ పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. గ్రామంలోని డ్రైనేజీ వ్యవస్థను, వీధి దీపాలను పరిశీలించారు. గ్రామ సర్పంచి బొమ్మినేని నారాయణతో మాట్లాడుతూ.. పారిశుద్ధ్యం మెరుగు, వీధిలైట్లు లేని చోట్ల కొత్తవి ఏర్పాటు చేయాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామని సచివాలయ సిబ్బందిని హెచ్చరించారు.

చంద్రబాబు వ్యాఖ్యలపై నిరసన

విశాలాంధ్ర-చీరాల: ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా ఇళ్ళు లేని పేదలకు దేశంలో ఎక్కడా లేని విధంగా పెద్ద ఎత్తున ఇళ్ల పట్టాలు ఇవ్వడంతో పాటు, ఇళ్ళు నిర్మించే కార్యక్రమం చేపట్టి అమరావతిలో 50వేల మందికి ఇళ్ళ పట్టాలు ఇవ్వడానికి నిర్ణయించడంపై, పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలను కించపరిచేలా మీకు ఇచ్చే సెంటు భూమి శవం పూడ్చడానికి సరిపోతుందంటూ" టీడీపీ నేత చంద్రబాబు నాయుడు మాట్లాడడం దుర్మార్గమని చీరాల వైస్సార్సీపీ ఇంచార్జి కరణం వెంకటేష్ అన్నారు. చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం చీరాల ముక్కోణం పార్క్ వద్ద బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజన శ్రీనివాసరావు,వైస్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు,అర్బన్ ఫైనల్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు,పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ మల్లీ వైష్ణవి,చీరాల మండలం ఆర్బికే చైర్మన్ కావూరి రమణారెడ్డి,వేటపాలెం మండలం ఆర్బికే చైర్మన్ పల్లపోలు శ్రీనివాసరావు, బాపట్ల జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షులు చీమకుర్తి బాలకృష్ణ,వైఎస్ఆర్సిపి ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు సల్లూరి అనిల్,మున్సిపల్ కౌన్సిలర్లు,కో-ఆప్షన్ సభ్యులు,వార్డు ఇన్చార్జిలు,చీరాల మండలం వైసీపీ నాయకులు,వేటపాలెం మండలం వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రాష్ట్రం నుంచి తరిమికొట్టాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీ జీఈఏ)గుంటూరు జిల్లా కార్యాలయంలో ఓపీఎస్ సాధన సమితి మొదటి సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం ఓపీయస్ సాధన సమితి జిల్లా అధ్యక్షులు ఫయాజ్ మాట్లాడుతూ సీపీఎస్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. ఓపీఎస్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ సాధించి తీరాలని, పెన్షన్ అనేది ప్రతీ ప్రభుత్వ ఉద్యోగి హక్కు అన్నారు. ఓపీఎస్ సాధనలో భాగంగా మిగిలిన ఉద్యోగ సంఘాలు కూడా తమకు మద్దతు ఇవ్వాలన్నారు. వైఎస్ జగన్ పాదయాత్రలో ఇచ్చిన ఓపీయస్ హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ప్రభుత్వం జీఓ ఎంఎస్ 653 ద్వారా ప్రవేశ పెట్టిన సీపీఎస్‌కు చట్టబద్ధత లేనందున ఆ జీఓను పున: సమీక్షించి ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఓపీఎస్‌ను అమలు చేయాలని కోరారు. ఓపీఎస్ జిల్లా అధ్యక్షులు ఫ్రాంజ్ అహ్మద్, కార్యదర్శి నాగరాజు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ జ్ఞాన్‌దేవ్, ఉపాధ్యక్షురాలు ప్రభావతి సతీష్, మీరా తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం దళారీల పాలు..

విశాలాంధ్ర-వేటపాలెం: అధికారి పార్టీ నేత ప్రధాన అనుచరుడి కనుసన్నలలో మండలంలోని రేషన్ బియ్యం అక్రమ రవాణా పెద్ద ఎత్తున అడ్డు అదుపు లేకుండా జరుగుతుంది. పొరుగు నియోజకవర్గం లోని మోటుపల్లికి చెందిన వ్యక్తి వేటపాలెం మండలంలోని యావత్తు రేషన్ షాపులతో టై అప్ అయ్యి అక్రమ రవాణాకు పెద్ద నెట్వర్క్ ను రెవెన్యూ పోలీస్ అధికారుల సహకారంతో ఏర్పాటు చేశారు. మండ లంలో దాదాపు 45 రేషన్ షాపులు ఉన్నాయి ప్రతి రేషన్ షాపులో దాదాపు సగం బియ్యం డీలర్లకు రాకమునుపే దళారీలకు పార్సిల్ అవుతున్నాయి. ప్రతి రేషన్ షాపు డీలర్ రేషన్ వినియోగదారులకు ఇవ్వకుండా బదులుగా డిమాండ్ ను బట్టి ఎనిమిది నుంచి పది రూపాయలకు చెల్లిస్తున్నారు. రేషన్ డీలర్ల నుండి దళారులు ఒక కేజీ రేషన్ కు 12 రూపాయలకు చెల్లించి, నాలుగు రూపాయల అదనపు లాభంతో 16 రూపాయలు అమ్మి సొమ్ము చేసుకుంటున్నాడు. సొంతగా మూడు వాహనాలు సమకూర్చుకొని ప్రతి నెల ఒకటవ తేదీ నుండి ఐదవ తేదీ లోపు సుమారు 20 నుండి 25 లోడుల పిడిఎఫ్ రేషన్ బియ్యాన్ని అక్రమంగా అర్ధ

రాత్రులు జిల్లాలు దాటిస్తున్నారు. మారిన రాజకీయ పరిస్థితులలో అన్ని వర్గాలు అధికార పార్టీ కిందకు చేరడంతో అక్రమ రవాణాలో తీవ్రమైన పోటీ నెల కొంది. అందువల్ల మండలంలో ఎవరైనా కొత్తగా ఈ రేషన్ వ్యాపారంలో దిగితే సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చి పట్టించడంలో ఒకరికొకరు పోటీ పడుతున్నారు. సేకరించిన బియ్యాన్ని తరలించి నేరుగా కాకినాడ, కృష్ణపట్నం, చెన్నై పోర్టులకు తరలించి అక్కడనుండి విదేశాలకు తరలిస్తున్నారు. మరికొంత బియ్యాన్ని రైస్ మిల్లులలో కెమికల్స్ వాడి రీసైక్లింగ్ చేసి రకరకాల రంగుల సంచులలో బియ్యన్ని ప్యాకింగ్ చేసి దుకాణాలకు సరఫరా చేసి తిరిగి ప్రజలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటు న్నారు. చినగంజాం మండలం మోటుపల్లి కి చెందిన వెంకటరావు పై పి.డి.ఎఫ్ రైస్ రవాణా చేస్తున్న సమయంలో ఒక సంవత్సరకాలంలోనే వేటపాలెం పోలీస్ స్టేషన్లో మూడు కేసులు నమోదు అయ్యాయి. గతంలో అనేక కేసులు నమోదైనా ఇతని తీరు మార లేదు. చట్ట వ్యతిరేకంగా పేదలకు అందాల్సిన రైస్ ను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న వెంకట్రావు లాంటి వారిపై పిడి యాక్ట్ అమలు చేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

జగనన్న కాలనీ నిర్మాణాల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించం: కలెక్టర్

విశాలాంధ్ర - బాపట్ల : జగనన్న కాలనీలలోని పక్కా గృహాల నిర్మాణాలలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తే సహించేది లేదని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా హెచ్చరించారు. అభివృద్ధి కార్యక్ర మాలపై డివిజన్, మండల స్థాయి అధికారులతో శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నుంచి ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. జగనన్న కాలనీలలో భూమి చదును చేసే పనులు శరవేగంగా చేపట్టా లని కలెక్టర్ ఆదేశించారు. నిర్దేశించిన గడువు లోగా పనులు పూర్తి చేయాలని పలుసూచనలు చేశారు. గ్రామాలలోని లబ్ధిదారులను చైతన్య పరచడంలో అధికారులు చిత్తశుద్ధి ప్రదర్శించడం లేదని ఆయన అసహనం వ్యక్తం చేశారు. జిల్లాలో 12 వేల పక్కా గృహాలు పునాది స్థాయిలోనే ఉండ డంపై ఆయన ఆరా తీశారు. మండలాలు, గ్రామాల వారీగా నిర్మాణం పనులపై సమీక్షిం చారు. ప్రతిరోజు ఆర్డీవోలు దిగువ స్థాయి అధికారులు, సిబ్బందితో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించాలని ఆదేశించారు. గృహ నిర్మాణ పనులు ఒక దశ నుంచి మరొక దశలోకి చేరేలా అధికా రులు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా వేమూరు, అమర్తలూరు, భట్టిప్రోలు మండలాలలో పురోగతి అత్యంత తక్కువగా ఉండడంతో సంబంధిత అధికారులపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అమర్తలూరు ఎంపీడీవో గైర్హాజరపై షోకాజ్ నోటీస్ జారీ చేయాలన్నారు. మోదుకూరు గ్రామం ఇంజనీరింగ్ అసిస్టెంట్ పనితీరు సరిగా లేకపోవడంతో షోకాజ్ నోటీస్ జారీ చేయాలన్నారు.ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణంలో అధికారులు అలక్ష్యం వహించరాదని కలెక్టర్ హెచ్చరించారు. నిర్దేశించిన గడువులోగా పనులు వేగంగా చేపట్టాలన్నారు. ఎప్పటికప్పుడు బిల్లులు ఆన్ లైన్ లో ప్రభుత్వానికి పంపాలన్నారు. నిర్మాణాలలో పురోగతి కనిపించాలని అధికారులను ఆయన ఆదేశించారు. నాడు-నేడు పనులలో పది అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రూ.13 కోట్ల నిధులు సిద్ధంగా ఉన్నందున పనులు వేగంగా చేపట్టాలన్నారు. నిధుల కొరత లేనందున విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి లక్ష్యం మేరకు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. గడప గడపకు మన ప్రభుత్వం కింద మంజూరైన పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో పనుల నాణ్యతను అధికారులు పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీవోలు తదితరులు పాల్గొన్నారు.